విశాఖపట్టణం
శనివారం 28 మార్చి 2026

For a pure tomorrow..

జయ జయహే

jayajayahey.in సంపుటి: 9 సంచిక: 63 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## జనసేన ఆఫీసు ముందే ఆత్మహత్య చేసుకుంటా

పార్టీకి దూరమంటూ.. కార్యక్రమాలకు హాజరు

పవన్‌కు తెలిసే ఇదంతా జరుగుతోంది

రెండు నెలలు గడిచినా ఏ చర్యలు లేవు

మరో వీడియో రిలీజ్ చేసిన హర్షవీణ



2




## ఎక్సైజ్ సుంకం తగ్గింపు

### పెట్రోల్, డీజిల్ లీటర్‌కు రూ. 10

### ఇంధన ధరలు మరింత తగ్గే అవకాశం

### ఉద్రిక్తతల వేళ సామాన్యుడికి ఊరట

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

అమెరికా–ఇరాన్ ఉద్రిక్తతల వేళ దేశవ్యాప్తంగా ఇంధన ధరలు పెరిగే అవకాశం ఉన్నందున, భారత ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ పై అదనపు ఎక్సైజ్ సుంకాన్ని భారీగా తగ్గించింది. గురువారం విడుదల చేసిన జీవో ప్రకారం, పెట్రోల్ పై అదనపు ఎక్సైజ్ ట్యాక్స్ లీటరుకు రూ.13 నుంచి రూ.3కి తగ్గించారు. డీజిల్ పై ఎక్సైజ్ సుంకం లీటరుకు రూ.10 నుంచి 0కి తగ్గించారు. కేంద్రం చేసిన పన్నుల తగ్గింపు వల్ల సామాన్య వినియోగదారులకు పెట్రోల్ తక్కువ ధరకు లభించే అవకాశం లేదని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఎందుకంటే, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు పంపు విక్రయాలపై ఎదుర్కొంటున్న భారీ నష్టాలను భర్తీ చేసుకోవడానికి ఈ తగ్గింపును అవే వినియోగించుకునే అవకాశం ఉంది. పెట్రోల్, డీజిల్ ధరలు ప్రస్తుతానికి యథాతథంగా ఉండనున్నాయి. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడ్ ధరలు బ్యారెల్‌కు 100 అమెరికన్ ..మిగతా 2లో

# సమష్టిగా ఎదుర్కొందాం



### భారత్ పైనా యుద్ధ ప్రభావం

### కేంద్ర నిర్ణయాలకు సహకరించాలి

### నిత్యావసరాలకు అవంతరం రాకూడదు

### సీఎంలతో ప్రధాని నరేంద్ర మోడీ భేటీ

### ఇంధన సంక్షోభంపై కీలక చర్చ

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

పశ్చిమాసియాలో ఘర్షణలు, హోర్ముజ్ జలసంధి మూసివేత భయాల కారణంగా అంతర్జాతీయ సంక్షోభం తలెత్తడంతో రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఇంధన సంక్షోభంపై చర్చించారు. పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ, ఎరువుల సరఫరాకు ఎదురవుతున్న సమస్యలు, రాష్ట్రాల సన్నద్ధతను సమీక్షించారు. అసెంబ్లీ ఎన్నికలు ప్రకటించిన రాష్ట్రాల ముఖ్యమంత్రులు మినహా తక్కిన రాష్ట్రాల మఖ్యమంత్రులు ఈ వర్చువల్ సమావేశంలో పాల్గొన్నారు. దేశ ఇంధన అవసరాలను తీర్చేందుకు, ఇంధన సరఫరా స్థిరంగా ఉండేందుకు కేంద్రం పలు చర్యలు తీసుకుంటోంది. అయితే క్షేత్రస్థాయిలో అమలు కోసం రాష్ట్రాల సహకారాన్ని ఇప్పటికే కోరింది. పశ్చిమాసియాలో పరిస్థితుల ప్రభావం అంతర్జాతీయంగా అన్ని దేశాలపై పడిందని, భారత్‌పైనా ప్రభావం ఉందని ప్రధాని మోదీ పార్లమెంటు ఉభయసభల్లోనూ ప్రకటించారు. కోవిడ్ మహమ్మారిని సమష్టిగా ఎదుర్కొన్నట్టే తాజా పరిస్థితులను కేంద్రం, రాష్ట్రాలు కలిసికట్టుగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. నిత్యావసర వస్తువుల సరఫరాకు ఎలాంటి అవాంతరం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని రాష్ట్రాలను కోరారు. టీమిండియా స్పిరిట్‌తో పనిచేసి దేశానికి మారదర్శకంగా నిలవాల్సిన అవసరం ..మిగతా 2లో

# నేడు చారిత్రక అసెంబ్లీ

### అమరావతి రాజధానిగా తీర్మానం

### ఒక రోజు శాసనసభ సమావేశం

### పార్లమెంట్‌లో బిల్లుతో చట్టబద్ధత

### తర్వాత గెజిట్ విడుదల




**(అమరావతి - జయజయహే)**

రాజకీయ ముఖచిత్రంలో అమరావతి కేవలం ఒక రాజధాని నగరం మాత్రమే కాదు, అది ఒక ఐదు కోట్ల ప్రజల ఆశలకూ, ఆవేదనలకూ ప్రతీకగా మారింది. ఐదేళ్లుగా ఎదుర్కొన్న అనిశ్చితికి తెరదించుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అమరావతికి కేంద్ర రక్షణ కవచం కల్పించే దిశగా వేస్తున్న అడుగులు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. రాష్ట్ర విభజన చట్టం–2014లో కొత్త రాజధాని అనే పదం ఉందే తప్ప, స్పష్టంగా అమరావతి అనే పేరు లేదు. దీనిని ఆసరాగా చేసుకునే గత వైసీపీ ప్రభుత్వం మూడు ..మిగతా 2లో



## పెళ్లైన వ్యక్తి మరో స్త్రీతో సహజీవనం తప్పు కాదు

మేజర్ మహిళ అంగీకారంతో చేయొచ్చు

చట్టపరంగా చర్య తీసుకోవడం కుదరదు

నైతికత వేరు.. చట్టం వేరు.. అలహాబాద్ కోర్టు సంచలన తీర్పు

3



### విశాఖ నుంచి విజయవాడకు

## ఇక ఈజీ

### ఆరు లైన్ల మేర హైవే విస్తరణకు ఓకే

### అనకాపల్లి డైట్ కాలేజీ నుంచి దివాన్ చెరవు వరకు

### 160 కి.మీ విస్తరణకు 3,800 కోట్ల రూపాయల వ్యయం

### కీలక ప్రాజెక్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

జాతీయ రహదారుల అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులతో పాటు కొత్త పనులపై కూడా ముందడుగు వేస్తోంది. ఏపీలో వాహనదారుల ..మిగతా 2లో

## గెస్ట్ హౌస్‌లో నాగిని డ్యాన్స్..!

### మహిళతో టీడీపీ నేతల అసభ్య నృత్యాలు

### నెల్లూరు తెలుగు తమ్ముళ్ల నిర్వాకం




**(నెల్లూరు - జయజయహే)**

అధికార పక్షానికి చెందిన పలువురు నాయకులు కట్టుతప్పుతున్నారు. తాజాగా నెల్లూరు జిల్లాకు చెందిన నేతల అసభ్యకరమైన నృత్యాలు ప్రత్యర్థులకు అస్త్రాలుగా మారాయి. వారంతా వివిధ నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారే కావడంతో ప్రభుత్వం ఇరుకునే పడే పరిస్థితి కనిపిస్తోంది. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వారు తరచూ ఇలాంటి వివాదాల్లో చిక్కుకోవడం పార్టీకి, ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది. నెల్లూరు జిల్లా చిల్లకూరు ..మిగతా 2లో

## కుప్పకూలిన డ్రోన్

### తప్పిన ప్రమాదం



2



## డిప్యూటీ స్పీకర్ రఘురామపై దాడి

మేకుల కర్రలు, చాకులతో ఎటాక్

ఆలయంపై రెండు వర్గాల వివాదమే కారణం

2

# నేడు చారిత్రక అసెంబ్లీ

**మొదటి పేజీ తరువాయి...**

రాజధానుల ప్రతిపాదనను తెరపైకి తెచ్చిందని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పుడు అసెంబ్లీలో తీర్మానం చేసి, దాని ఆధారంగా కేంద్రం విభజన చట్టంలోని సెక్షన్-5ను సవరించడం ద్వారా అమరావతిని అధికారిక రాజధాని గా గెజిట్‌లో చేర్చనుంది. ఒకసారి చట్టంలో పేరు చేరితే, భవిష్యత్తులో ఏ ప్రభుత్వం వచ్చినా, ఏ ముఖ్యమంత్రి అనుకున్నా దానిని మార్చడం రాజ్యాంగబద్ధంగా దాదాపు అసాధ్యం అవుతుంది. ఇది అమరావతికి ఒక పటిష్టమైన చట్టబద్ధమైన గ్యారంటీ ని ఇస్తుంది. రాజధాని విషయంలో గతంలో ఏర్పడిన గందరగోళం వల్ల అంతర్జాతీయ సంస్థలు, భారీ పరిశ్రమలు ఏపీకి రావడానికి వెనుకాడాయి. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ ముద్ర పడటంతో, అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలకు నమ్మకం కలుగుతుంది. కేంద్రం నుంచి వచ్చే నిధులు, ప్రపంచ బ్యాంకు వంటి సంస్థల రుణాల మంజూరు ప్రక్రియ మరింత సులభతరం అవుతుంది. చట్టబద్ధమైన గుర్తింపు వల్ల అమరావతి కేవలం ఒక పరిపాలనా కేంద్రంగానే కాకుండా, ఆర్థిక రాజధానిగా ఎదిగేందుకు పునాది పడుతోంది. అమరావతి కోసం భూములిచ్చిన 29 వేల మంది రైతులకు ఈ నిర్ణయం ఒక పెద్ద విజయం. గత ఐదేళ్లుగా వారు చేసిన పోరాటానికి ఇప్పుడు తగిన గుర్తింపు లభించినట్లయింది. రాజధాని మార్పు సాధ్యం కాదన్న స్పష్టత రావడంతో, భూముల విలువలు పెరగడమే కాకుండా, రాజధాని విస్తరణకు అవసరమైన రెండో విడత భూసమీకరణకు కూడా రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చే అవకాశం ఉంది. ఇది రాజధాని నిర్మాణ వేగాన్ని మరింత పెంచుతుంది.



ఢిల్లీ స్థాయిలో చక్రం తిప్పి, ప్రధానమంత్రి కార్యాలయం నుంచి ఆమోదం పొందడంలో చంద్రబాబు నాయుడు తన అనుభవాన్ని ఉపయోగించారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం, ఈ అవకాశాన్ని రాజధాని అస్తిత్వాన్ని కాపాడటానికి వాడుకోవడం ఒక మాస్టర్ స్ట్రోక్ అని విశ్లేషకులు భావిస్తున్నారు. అమరావతికి లభించబోయే ఈ 'కేంద్ర రక్షణ' కేవలం చట్టపరమైన మార్పు మాత్రమే కాదు, అది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థిరత్వానికి, అభివృద్ధికి ఒక బలమైన హామీ. అసెంబ్లీలో ఈ తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు వైసీపీ ఏ స్టాండ్ తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది. మద్దతు ఇస్తే తమ పాత వాదన తప్పు అని ఒప్పుకున్నట్లవుతుంది, వ్యతిరేకిస్తే అమరావతి ద్రోహులు గా ముద్ర పడే ప్రమాదం ఉంది. అయితే ఎప్పట్లానే సమావేశానికి గైర్హాజర్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. తాము అమరావతికి వ్యతిరేకం కాదని ప్రకటనలు చేస్తున్నా.. పరస్పర విరుద్ధమైన ప్రకటనలు తరచూ చేస్తూండటంతో ప్రజల్లో నమ్మకం లేకుండా పోయింది.



## జనసేన ఆఫీసు ముందే
# ఆత్మహత్య చేసుకుంటా

**పార్టీకి దూరమంటూ.. కార్యక్రమాలకు హాజరు**

**పవన్‌కు తెలిసే ఇదంతా జరుగుతోంది**

**రెండు నెలలు గడిచినా ఏ చర్యలు లేవు**

**మరో వీడియో రిలీజ్ చేసిన హర్షవీణ**

**(రైల్వే కోడూరు - జయజయహే)**

రైల్వే కోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ లైంగిక వేధింపుల కేసు విషయం ఇంకా కొలిక్కి రాలేదు. రెండు నెలలు గడిచిపోయినా ఇంతవరకు అరవ శ్రీధర్ పై జనసేన పార్టీ నుంచి ఎటువంటి చర్యలు తీసుకోలేదని.. హర్షవీణ మరో సంచలన వీడియో రిలీజ్ చేసింది. దానికి కారణం ఎమ్మెల్యే పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని.. జనసేన ప్రకటించినప్పటికీ.. ఎమ్మెల్యే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటుండడంపై ఆమె ఆగ్రహం వ్యక్తంచేసింది. నిన్న రైల్వేకోడూరులోని జనసేన పార్టీ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీధర్ పాల్గొన్నారు. అందుకే హర్షవీణ ఈ వీడియో రిలీజ్ చేస్తున్నట్లు తెలిపింది. పార్టీ కార్యక్రమాలలో పాల్గొనకూడదని అధినేత చెప్పినా అరవ శ్రీధర్ కార్యక్రమాలలో పాల్గొనడంతో.. అసలు పార్టీ అంటే అరవ శ్రీధర్ కు విలువ ఉందా .. అధినేత పవన్ కళ్యాణ్ కు తెలిసే ఇదంతా జరుగుతుందా అని హర్షవీణ ప్రశ్నించింది. ఎమ్మెల్యే పదవి ఉంది కాబట్టే ఇంతవరకు అతన్ని అరెస్ట్ చేయలేదని పేర్కొంది. ఒక ఆడపిల్లకు అన్యాయం జరుగుతుంటే.. రెండు నెలలు అయినా కమిటీ ఇచ్చిన రిపోర్టు అనంతరం ఎమ్మెల్యే పై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ఆమె ప్రశ్నించింది. తనకు న్యాయం జరగకపోతే ఆత్మహత్య చేసుకుంటానని వీడియోలో పేర్కొంది.

# ఎక్సైజ్ సుంకం తగ్గింపు

**మొదటి పేజీ తరువాయి...**

డాలర్లు దాటాయి. దీనివల్ల ప్రస్తుతం ఓఎంసీలు విక్రయించే ప్రతి లీటరు పెట్రోల్ లేదా డీజిల్‌పై రూ. 48.8 నష్టపోతున్నాయి. రష్యా కంపెనీ రోస్నెఫ్ట్, కేసాని ఎంటర్ప్రైజెస్ మద్దతు ఉన్న దేశీయ అతిపెద్ద ప్రైవేట్ ఇంధన విక్రయ సంస్థ నయారా ఎనర్జీ, పెట్రోల్, డీజిల్ ధరలను రూ. 5.3, రూ. 3 పెంచిన తరువాత రోజే ప్రభుత్వం ఈ ఎక్సైజ్ సుంకం తగ్గింపు నిర్ణయం తీసుకుంది. ఇరాన్ హర్మూజ్ జలసంధిపై ఆంక్షలు విధించిన కారణంగా ఏర్పడిన ప్రపంచ ఇంధన సంక్షోభం సమయంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. హర్మూజ్ జలమార్గం ప్రపంచానికి ఒక ముఖ్యమైన ఇంధన సరఫరా మార్గం. 20 నుండి 25 మిలియన్ బ్యారెల్స్ ముడి చమురు, దాదాపు 10 బిలియన్ క్యూబిక్ అడుగుల గ్యాస్ ఈ మార్గం ద్వారా సరఫరా అవుతుంది. అంతేకాకుండా, కేంద్ర ప్రభుత్వం మొదటిసారిగా ఏవియేషన్ టర్బైన్ ఇంధనంపై ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకాన్ని విధించింది. కొత్త నిబంధనల ప్రకారం, ఏటీఎఫ్ పై లీటరుకు ₹50 పన్ను నిర్ణయించారు. మినహాయింపు తరువాత, ఎఫెక్టివ్ రేటు లీటరుకు 29.5కి తగ్గించారు. ఇది విమానయాన సంస్థల వ్యయాన్ని పెంచే అవకాశం ఉంది. ప్రభుత్వం పెట్రోల్ పై పన్నును పూర్తిగా తొలగించింది. అయితే డీజిల్ పై లీటరుకు ₹18.5 చొప్పున నిర్ణయించింది. ఎగుమతుల కోసం పెట్రోల్, డీజిల్ , ఏటీఎఫ్ పై అనేక సుంకాల నుండి మినహాయింపు ఇచ్చారు. దీనితో పాటు 2022లో అమలులోకి వచ్చిన విండ్‌ఫాల్ టాక్స్ కూడా రద్దు చేశారు. దీనివల్ల దేశీయ చమురు కంపెనీలకు ఉపశమనం లభిస్తుంది. ఈ మార్పులన్నీ అమలులోకి వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం గురువారం తన వైఖరిని మరోసారి స్పష్టం చేసింది. భారత్ వద్ద సుమారు 60 రోజులకు సరిపడా చమురు నిల్వలు, 30 రోజులకు సరిపడా ఎల్‌పీజీ సిలిండర్లు ఉన్నాయని తెలిపింది. కొరత గురించి వస్తున్న నివేదికలను కొట్టిపారేసింది. ముడి చమురు, ఎల్‌పీజీ దిగుమతులను పెంచడానికి ప్రభుత్వం కొత్త ఒప్పందాలను వేగవంతం చేసినట్లు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి ఈ వారం పార్లమెంటులో మాట్లాడుతూ, భారత్ లోని మూడు వ్యూహాత్మక నిల్వ కేంద్రాలలో ప్రస్తుతం సుమారు 3.372 మిలియన్ టన్నుల చమురు ఉందని, ఇది వాటి గరిష్ట సామర్థ్యంలో మూడింట రెండు వంతులని తెలిపారు.

# గెస్ట్ హౌస్‌లో నాగిని డ్యాన్స్..!

**మొదటి పేజీ తరువాయి...**

మండలంలో తెలుగు దేశం పార్టీకి చెందిన నేతల వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ వీడియోలో తమ్మినపట్టణం కోదండరామ స్వామి ఛైర్మన్ సతీష్ యాదవ్, బొల్లవోలు టీడీపీ నేత దువ్వూరు వినయ్ ఉన్నారు. వాళ్లిద్దరు ఓ మహిళతో కలిసి గెస్ట్‌హౌస్‌లో డ్యాన్స్‌లు చేస్తున్న దృశ్యాలు వైరల్ అవుతున్నాయి. ముగ్గురు కూడా ఒళ్లు మరిచి సినిమా పాటలకు అనుగుణంగా డ్యాన్స్ చేస్తున్నారు. అక్కడే మందు, విందులో పాల్గొన్నట్టు వార్తలు వస్తున్నాయి. ఒక పవిత్ర ఆలయానికి ఛైర్మన్‌గా ఉన్న వ్యక్తి ఇలాంటి అసభ్యకర నృత్యాలు, ప్రవర్తనకు పాల్పడటంపై వైసీపీ ఆగ్రహం వ్యక్తం చేస్తోందీ. ఈ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసిన ఆ పార్టీ, కూటమి నేతలకు ఇలాంటిది సర్వసాధారణమైపోయిందని పోస్టు పెట్టింది. "ఏపీలో బీఆర్ నాయుడి బాటలో మరో ఆలయ ఛైర్మన్ రాసలీలల వీడియోలు బయటికి వచ్చింది. తమ్మిన పట్టణం కోదండ రామస్వామి ఛైర్మన్, ఎమ్మెల్యే సోమిరెడ్డి అనుచరుడు సతీష్ యాదవ్ ఓ మహిళతో అడ్డంగా దొరికిపోయాడు. బొల్లవోలు టీడీపీ నాయకుడు దువ్వూరు వినయ్ రెడ్డి, మరో టీడీపీ నాయకుడు తూర్పు కనుపూరు చెందిన బొబ్బాయి శివ కుమార్ కూడా రాసలీలలు చేస్తూ పట్టుబడ్డారు. బీఆర్ నాయుడు కామలీలలు బయటికి వచ్చినా.. చంద్రబాబు ఏం చర్యలు తీసుకోకపోవడంతో యథేచ్ఛగా రెచ్చిపోతున్న తెలుగు తమ్ముళ్లు . ఇదీ చంద్రబాబు మీ మంచి ప్రభుత్వంలో మీ నాయకులు వెలగబెడుతున్న రాచకార్యాలు" అని విమర్శలు చేసింది. దీనిపై ఆ పార్టీ లీడర్,వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత ఘాటుగా స్పందించారు. " రాష్ట్రంలో మహిళలకు రక్షణ పూర్తిగా లేకుండా పోయింది. టీటీడీ ఛైర్మన్ స్థాయి వ్యక్తి నుంచి చిన్న ఆలయాల ఛైర్మన్‌ల వరకూ మహిళలపై లైంగిక దాడులకు పాల్పడుతున్నారు. ఆఖరికి ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఓ మహిళను వేధిస్తూ అడ్డంగా దొరికిపోయిన అతనిపై చర్యలు తీసుకోలేదు. మహిళల సహన శక్తుల్ని ఈ కూటమి ప్రభుత్వం పరీక్షిస్తోంది . మహిళాలోకం ఎదురుతిరిగే రోజు దగ్గరలోనే ఉంది." అని వార్నింగ్ ఇచ్చారు. టీటీడీ ఛైర్మన్ స్థాయి వ్యక్తి నుంచి చిన్న ఆలయాల ఛైర్మన్‌ల వరకూ మహిళలపై లైంగిక దాడులకు పాల్పడుతున్నారు. ఆఖరికి ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఓ మహిళను వేధిస్తూ అడ్డంగా దొరికిపోయిన అతనిపై చర్యలు తీసుకోలేదు.



# కుప్పకూలిన డ్రోన్

**తప్పిన ప్రమాదం**

**(అల్లూరి జిల్లా - జయజయహే)**

అల్లూరు సీతారామరాజు మన్యం జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో ఒక్కసారిగా డ్రోన్ కూలిపోయింది. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. జిల్లాలోని జి.మాడుగుల మండలం బొయితిలి సమీపంలో శుక్రవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. ఏజెన్సీ ప్రాంతంలోని మారుమూల గ్రామాలకు అత్యవసరమైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో రెడ్ వింగ్ సంస్థ, ప్రభుత్వం సంయుక్తంగా డ్రోన్ సేవలను పరిశీలిస్తున్నాయి. రక్తం నమూనాలు, అత్యవసర మందులను వేగంగా తరలించేందుకు ఎమర్జెన్సీ మెడికల్ ట్రయల్ రన్ చేపట్టారు. ఆ క్రమంలో బొయితిలి గ్రామ పరిసరాల్లో ఎగురుతూ కూలిపోయింది. ఈ డ్రోన్.. చెట్లపై పడింది. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఆ ప్రాంతంలో ఎవ్వరూ లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

# డిప్యూటీ స్పీకర్ రఘురామపై దాడి

**మేకుల కర్రలు, చాకులతో ఎటాక్**

**ఆలయంపై రెండు వర్గాల వివాదమే కారణం**

**(ఏలూరు - జయజయహే)**

పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో శ్రీరామనవమి వేడుకలు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. పెదపేటలోని పురాతన రామాలయ దర్శనానికి వెళ్లిన అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కాన్వాయ్‌పై జరిగిన దాడి రాజకీయంగా సంచలనం సృష్టించింది. మేకుల కర్రలు, చాకులతో జరిగిన ఈ భయానక దాడిలో పలువురు కార్యకర్తలు తీవ్రంగా గాయపడటంతో ఆకివీడు ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఆకివీడు పెదపేటలో దశాబ్దాల చరిత్ర కలిగిన ఒక పురాతన రామాలయం శిథిలావస్థకు చేరింది. స్థానికంగా జరిగిన సామాజిక మార్పుల వల్ల కాలక్రమేణా ఆ ఆలయ ప్రాభవం తగ్గిపోయింది. అయితే, దీనిని పునర్నిర్మించి పూర్వవైభవం తీసుకురావాలని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు సంకల్పించారు. ఈ ప్రయత్నంపై స్థానిక ఇతర వర్గాల నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. సదరు స్థలం వివాదాస్పదమని, అక్కడ నిర్మాణం చేపడితే తమ ప్రార్థనలకు ఆటంకం కలుగుతుందని కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా ఈ విషయంలో రఘురామరాజుకు, స్థానిక వర్గాలకు మధ్య తీవ్ర వాదోపవాదాలు నడుస్తున్నాయి. పండుగ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ హోదాలో రఘురామరాజు ఆలయాన్ని దర్శించి, శ్రీరామునికి పూజలు నిర్వహించేందుకు రాగా.. ఆందోళనకారులు ఆయనను అడ్డుకున్నారు. దర్శనం ముగించుకుని తిరిగి వెళ్తున్న సమయంలో ఒక్కసారిగా గుంపుగా విరుచుకుపడ్డారు. కేవలం నిరసనతో ఆగకుండా, మేకులు కొట్టిన కర్రలు, చాకులతో దాడికి తెగబడ్డారు. రఘురామరాజును రక్షించే క్రమంలో జనసేన నేత అనిల్ తలకు మేకులు దిగబడి తీవ్ర రక్తస్రావమైంది. మరో కార్యకర్త వీపుపై చాకుతో దాడి జరగడంతో పరిస్థితి విషమంగా మారింది. క్షతగాత్రులను వెంటనే ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. ఈ దాడిపై రఘురామకృష్ణరాజు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భగవంతుని దర్శనానికి వస్తే ఇలాంటి ప్రాణాంతక దాడులకు పాల్పడటం సభ్యసమాజం తలదించుకోవాల్సిన విషయం. ఇది ముందస్తు ప్రణాళికతో జరిగిన దాడిలా కనిపిస్తోంది. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టం అని ఆయన స్పష్టం చేశారు. ఈ ఘటనతో పశ్చిమగోదావరి జిల్లాలో హై అలర్ట్ ప్రకటించారు. ఆకివీడులో మరోసారి ఘర్షణలు తలెత్తకుండా అదనపు పోలీసు బలగాలను రంగంలోకి దించారు. జిల్లా ఎస్పీ స్వయంగా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. దాడికి పాల్పడిన వారిని గుర్తించేందుకు సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. ఇప్పటికే పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ దాడిని ఖండిస్తూ తెలుగుదేశం, జనసేన శ్రేణులు ఆందోళనకు సిద్ధమవుతుండటంతో పట్టణంలో 144 సెక్షన్ తరహా వాతావరణం నెలకొంది.



# సమష్టిగా ఎదుర్కొందాం

**మొదటి పేజీ తరువాయి...**

ఉందన్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రులతో మోదీ తాజాగా వర్చువల్ సమావేశంలో పాల్గొనడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రధానమంత్రి నిర్వహించిన వర్చువల్ మీట్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు, ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణు దేవ్ సాయి, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, జేకే సీఎం ఒమర్ అబ్దుల్లా, పంజాబ్ సీఎం భగవంత్ మాన్, మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్, ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి, గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ తదితరులు పాల్గొన్నారు.



# విశాఖ నుంచి విజయవాడకు ఇక ఈజీ

**మొదటి పేజీ తరువాయి...**

అవసరాలకు అనుగుణంగా పలు జాతీయ రహదారులను విస్తరిస్తున్నారు. అందులో భాగంగా మరో నేషనల్ హైవేను కూడా మరింతగా విస్తరించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ సిద్ధమైంది. అనకాపల్లి నుంచి తూర్పుగోదావరి వరకు ఉన్న జాతీయ రహదారి 16 ప్రస్తుతం నాలుగు లైన్లుగా ఉంది. అయితే దీనిని ఆరు లైన్ల రహదారిగా మార్చేందుకు రెడీ అయింది. అనకాపల్లిలోని డైట్ ఇంజినీరింగ్ కాలేజీ నుంచి తూర్పుగోదావరి జిల్లా దివాన్ చెరువు వరకు హైవేను ఆరు లైన్లుగా విస్తరించనున్నారు. 160 కిలోమీటర్ల మేరు విస్తరణ చేపట్టనుండగా.. ఇందుకోసం రూ.3800 కోట్ల వ్యయం కానుంది. విస్తరణలో భాగంగా బైపాస్, అండర్ పాస్, ఫ్లైఓవర్లు నిర్మించనున్నారు. విస్తరణ పనుల్లో భాగంగా హైవేను ఆరు లైన్ల రహదారిగా మార్చుతారు. ఇక 11 చోట్ల కొత్త ఫ్లైఓవర్లు, మూడు చోట్ల బైపాస్‌లు, ఐదు చోట్ల అండర్‌పాస్‌ల నిర్మాణం చేపడతారు. ప్రస్తుతం ఈహైవేలో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటుంది. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు హైవే విస్తరణకు ఎన్‌హెచ్‌ఏఐ ముందడుగు వేసింది. అనకాపల్లి జిల్లా వడ్డిమెట్ల నుంచి చేపూరు వరకు 7.7 కిలోమీటర్ల బైపాస్ ఈ ప్రాజెక్టులో భాగంగా నిర్మించనున్నారు. ఇక ఎర్రవరం వద్ద 3 కిలోమీటర్ల మేర మరో బైపాస్‌తో పాటు జగ్గంపేట దగ్గర 10 కిలోమీటర్ల మేర మరో బైపాస్ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ హైవేను విస్తరించాలని ఎన్‌హెచ్‌ఏఐకు స్థానిక ఎమ్మెల్యేల నుంచి వినతులు పలుమార్లు వెళ్లాయి. దీంతో అధికారులు స్పందించి ఆరు లైన్లుగా మార్చాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ నేషనల్ హైవే విస్తరణతో విజయవాడ, విశాఖపట్నం వెళ్లేవారికి ట్రాఫిక్ రద్దీ తగ్గనుంది. దీని వల్ల వేగవంతం, సౌకర్యవంమైన ప్రయాణం అందుబాటులోకి రానుంది. హైవే పనుల్లో భాగంగా తేటగుంట క్రాస్ రోడ్డు, అన్నవరంలో ఇరువైపులా సర్వీస్ రోడ్డు ఉండనున్నాయి. ఇకప్రతిపాడు అండస్ పాస్ విస్తరించనున్నారు. అలాగే జెడ్ రంగంపేట దగ్గర అండర్ పాస్ నిర్మించనున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో వాహనదారుల కోసం సర్వీస్ రోడ్లు కూడా ఉండనున్నాయి.

# భూ హక్కు దారులు రైతులకు మోసగిస్తే ఊరుకోం

## మూలపేట పోర్ట్ భూ సేకరణ అప్పుడే పూర్తి చేశారు

## రైతుల భూముల జోలికి వస్తే ఉద్యమిస్తాం

## ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ హెచ్చరిక

**టెక్కలి మార్చి 27 జయ జయహే**

శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాలి మండలం మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్ట్ ఉత్తరాంధ్ర మణిహారంగా ఈ ప్రాంత వాసులు అందరికీ ప్రత్యక్ష పరోక్ష ఉపాధి లు కలుగుతుందని ఉన్నత లక్ష్యముతో అప్పటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సారధ్యంలో యుద్ధ ప్రాతిపదికన ప్రజా సంక్షేమం కోసం గ్రీన్ పోర్ట్ నిర్మాణం త్వరిత గతిన పూర్తిచేసి ,ప్రజలకు అంకితం చేసేందుకు ఆయన హయాంలోనే పూర్తిగా పోర్టు భూముల సేకరణ జరిగిందని మళ్లీ అధనంగా రైతుల వద్ద నుంచి భూ సేకరణ అవసరం లేదని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. రైతులు వద్ద నుండి అదనంగా భూసేకరణ



చేయాలనుకుంటున్న కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు, మరి కొంతమంది జిల్లా నాయకులు ,స్వార్ధం కోసమేనని ఈ భూములన్నీబడా పారిశ్రామిక వేత్తలకు వీళ్లు సొమ్ములకు అమ్ముకోవడానికి వేస్తున్న మాస్టర్ ప్లాన్ అని శ్రీనివాస్ విమర్శించారు. రైతుల భూములను గ్రీన్ పోర్ట్ కోసం అయోధ్య పురం నుంచి మూలపేట పోర్టు వరకు కావలసిన భూసేకరణ అప్పుడే జరిగిందని, ప్రస్తుతం సెంటు భూమి కూడా పోర్టు అభివృద్ధికి కొనుగోలు చేయాల్సిన పనిలేదని ఆయన అన్నారు, ఒకవేళ పారిశ్రామిక అభివృద్ధి కోసం భూముల అవసరమైతే పారిశ్రామికవేత్తలు నేరుగా రైతులు వద్ద నుంచి కొనుగోలు చేయాలని రైతులే వారి భూముల ధర నిర్ణయించి వారి అంగీకారంతో వాళ్లకు నచ్చిన ధరకు క్రయవిక్రయాలు జరగాలని అది రైతుల ఇష్ట ప్రకారం అమ్మకాలు జరగాలన్నారు. అప్పట్లోనే మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి మూలపేట, విష్ణు చక్రం నిర్వాసితులకు భూముల నిధులను తక్షణమే మంజూరు చేయాలని ఆదేశించారన్నారని తెలిపారు.

నేటి కూటమి ప్రభుత్వం, మంత్రులు, పారిశ్రామిక అభివృద్ధి కోసం ల్యాండ్ బ్యాంక్ పేరుతో అనవసరపు భూ సేకరణ పేరిట రైతులు వద్ద నుంచి భూములు కొనుగోలు చేసి బడా పారిశ్రామిక వేత్తలతో అంతర్గత వ్యాపార భాగస్వామ్యం పొంది భూ హక్కుదారులైన సామాన్య రైతులకు అన్యాయం చేయాలని కింజరాపు కుటుంబం చూస్తుందని దీన్ని పూర్తిగా వ్యతిరేకించి భూ హకుదారులైన స్థానిక రైతుల శ్రేయస్సుకోసం మరో ప్రజా పోరాటానికి సిద్ధంగా ఉన్నామని దువ్వాడ శ్రీనివాస్ హెచ్చరించారు.



## నిత్య కృషీవలుడు

# నరసింహరాజు

### నరసింహరాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మార్నింగ్ కాఫీ క్లబ్

**భీమవరం :( జయ జయహే )**

30 ఏళ్లుగా డిఎన్నార్ కళాశాల అభివృద్ధికి కృషి చేసి నాక్, నాక్ డబుల్ ప్లస్, కళాశాల స్థాయిని దేశంలోనే చాటి చెప్పిన మహోన్నత కృషి వలుడు నరసింహరాజు అని మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు, కో కన్వీనర్ ఓలేటి శ్రీనివాస్, కొత్త శ్రీనివాస్,పిఆర్ఓ భట్టిప్రోలు శ్రీనివాసరావు అన్నారు. భీమవరం డిఎన్నార్ కళాశాల అధ్యక్షులు గోకరాజు వెంకట నరసింహరాజు పుట్టినరోజు సందర్భంగా వారికి మార్నింగ్ కాఫీ క్లబ్ తరుపున శుభాకాంక్షలు తెలియజేసి సత్కరించారు. వారు మాట్లాడుతూ డిఎన్నార్ కళాశాల అభివృద్ధికి, విద్యార్థుల అభ్యున్నతి కోసం నిరంతరం శ్రామికునిగా పని చేసే వ్యక్తి నరసింహరాజు అని, ఆయన మరెన్నో పుట్టినరోజు వేడుకలను జరుపుకోవాలని కోరుకుంటున్నామని అన్నారు. సభ్యులు జూలూరి రాజా తన కవితతో అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమం లో తటవర్తి బదరి, బొడ్డు వాసు, గాదె నాగేశ్వరావు, పులవర్తి రామకృష్ణ పున్నని కన్నయ్య కురిశెట్టి శ్రీనివాస అప్పారావు,కార్యక్రమంలో పాల్గొన్నారు



# మానవత్వం చాటుకున్న నక్కా కృష్ణ యాదవ్

**కొయ్యురు : (జయ జయహే ) న్యూస్ మార్చ్ 28**

అల్లూరి జిల్లా. కొయ్యూరు మండలం.సింగవరం గ్రామం శనివారం రాత్రి 11.గం సమయంలో పాము రాజు నివసిస్తున్న తాటాకు ఇల్లు అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోవడంతో భాధిత కుటుంబం పరిస్తితి మరింత దయానికంగా మారింది పాము రాజు గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు.ఇల్లు కోల్పోయి అనారోగ్యం తో బాధపడుతున్న కుటుంబానికి బాసటగా నక్క కృష్ణ యాదవ్ మానవత్వంతో ముందుకు వచ్చి తనవంతు ఆర్థిక సహాయం 20.000 రూపాయలు అందించి ఆ కుటుంబానికి అండగా నిలిచారు.



## ఆర్టీసీలో హెవీ వెహికల్ డ్రైవింగ్

# శిక్షణ ప్రారంభం

**విజయనగరం జయ జయహే ఏపీఎస్**

ఆర్టీసీలో ఇస్తున్న హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణను అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అధికారిని వరలక్ష్మి పిలుపునిచ్చారు. విజయనగరం ఆర్టీసీ ఆధ్వర్యంలో నడుస్తున్న హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు సంబంధించిన 27 వ బ్యాచ్ ను ప్రారంభించారు. లైట్ వెహికల్ లైసెన్స్, ఒక సంవత్సరం అనుభవం కలిగి 21 సంవత్సరాలు నిండినవారు ఈ వెహికల్ లైసెన్స్ డ్రైవింగ్ ట్రైనింగ్ కు అర్హులు. శిక్షణ 40 రోజుల పాటు ఉంటుంది తెలిపారు. ట్రైనింగ్ అయిన వందలాది అభ్యర్థులు వివిధ శాఖలలో ఉద్యోగాల్లో స్థిరపడ్డారు,మంచి మెలకువలు నేర్చుకోని ఉత్తమ డ్రైవర్ గా పేరు తెచ్చు కోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీనివాసరావు మరియు శిక్షకుడు రాజు, వేణు పాల్గొన్నారు.

# ప్రధాని మోదీకి ధన్యవాదాలు: కేఎన్ఆర్

**గాజువాక ( జయ జయహే)**



గాజువాక బిజేపి కార్యాలయంలో రాష్ట్ర మీడియా పేనలిస్ట్ మరియు గాజువాక ఇంచార్జ్ కరణంరెడ్డి నరసింగరావు ఒక ప్రకటన విడుదల చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరాన్ ఇజ్రాయల్ మధ్య యుద్ధం జరుగుతున్న సందర్భంలో ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో పెట్రోల్ మరియు డీజిల్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో మన భారతదేశంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో పెట్రోల్ పై వున్న ఎక్సైజ్ డ్యూటీ రూ. 13/- నుండి 3/- కి అదేవిధంగా డీజిల్ పై వున్న ఎక్సైజ్ డ్యూటీ రూ. 10/- పూర్తిగా తగ్గింపు చేసి దేశ ప్రజలకు శ్రీరామనవమి పండుగ రోజున శుభవార్త చెప్పారని అన్నారు. దీని వలన రవాణా ఖర్చులు తగ్గి ,దేశంలో ప్రజలకు మంచి జరుగుతుంది అని అన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని నరేంద్ర మోదీ కు ధన్యవాదాలు తెలిపారు.

# మన భద్రత కుటుంబానికి వరం

### సైబర్ నేరాలు అవగాహనతో అడ్డుకుందాం .. టెక్కలి పోలీస్ శక్తి టీం భద్రత సదస్సులు

**టెక్కలి మార్చి 27 జయ జయహే**

ప్రజా భద్రత తమ కుటుంబాలకు వరం లాంటిదని సైబర్ నేరాలను, వ్యక్తిగత భద్రత ఏ వయసులో వారైనా తమ జాగ్రత్త కుటుంబానికి వరం లాంటిదని టెక్కలి పోలీస్ శక్తి టీం ప్రతినిధులు పలు ప్రాంతాల్లో విస్తారంగా భద్రత అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నారు. టెక్కలి సర్కిల్ పరిధిలో కోటబొమ్మాలి మండలం పిఎన్ కాలనీ రామ మందిరం వద్ద యువకలు నేడు జరుగుతున్న సైబర్ నేరాలను వ్యక్తిగత భద్రతను తమకు తాము రక్షించుకునేలా చట్టపరమైన అంశాల గూర్చి శక్తి టీం ప్రతినిధులు వివరించారు, బాల బాలికలు, యువతీ యువకులు, స్వీయ



రక్షణ కోసం పోలీస్ హెల్ప్ లైన్ కు తగిన సమాచారం తక్షణమే అంద చేస్తే తమ ప్రమాదాల నుంచి క్షేమంగా బయట పడతారని శక్తి ప్రతినిధులు స్పష్టం చేశారు. యువకులు లైసెన్స్ పొందే విధానం, మైనర్లు వాహనాలను డ్రైవింగ్ చేయకూడదని, మద్యం సేవించి రహ దారుల్లో తమ వాహనాలను నడపడం ప్రమాదకరమని, పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్లు 1033,181,112,1091, ప్రమాదంలో ఉన్న, మోసాల గురైన వారు, వేధింపులు గురవుతున్న వారు, తక్షణమే పై నెంబర్లను ఫోన్ చేసి వారి ఆపదల నుంచి రక్షించబడాలని శక్తి టీం సభ్యులు టెక్కలి పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఎం గిరిధర్, కోటబొమ్మాలి హెడ్ కానిస్టేబుల్ కే గణేష్, సారవకోట డబ్ల్యూ పిసి కే రమణమ్మ, పోలాకి డబ్ల్యూ పిసి కే చామంతి, రామ మందిరం ధర్మకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## పెళ్లైన వ్యక్తి మరో స్త్రీతో

# సహజీవనం తప్పు కాదు

### మేజర్ మహిళ అంగీకారంతో చేయొచ్చు

### చట్టపరంగా చర్య తీసుకోవడం కుదరదు

### నైతికత వేరు.. చట్టం వేరు

### అలహాబాద్ కోర్టు సంచలన తీర్పు

**(ప్రత్యేకప్రతినిధి - జయజయహే)**

అలహాబాద్ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. పరస్పర అంగీకారంతో పెళ్లైన పురుషుడు, మేజర్ మహిళతో సహజీవనం చేయటం తప్పుకాదని, సదరు పురుషుడిపై చట్టపరంగా చర్యలు తీసుకోవటం కుదరదని కోర్టు తేల్చి చెప్పింది. పౌరుల హక్కులను పరిరక్షించేందుకు తాము తీసుకునే చర్యలు సామాజిక అభిప్రాయం లేదా నైతికతకు లోబడి ఉండవని స్పష్టం చేసింది. ఉత్తర ప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్‌కు చెందిన ఓ పెళ్లైన పురుషుడు, పెళ్లి కాని అమ్మాయి సహజీవనం చేస్తున్నారు. యువతి తల్లి ఆ జంటపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు వారిపై కేసు ఫైల్ చేశారు. ఈ నేపథ్యంలో పోలీస్ కేసును కొట్టి వేయాలంటూ జంట అలహాబాద్ కోర్టును ఆశ్రయించింది. కోర్టులో క్రిమినల్ రిట్ పిటిషన్ వేసింది. జంట వేసిన రిట్ పిటిషన్‌పై కోర్టు తాజాగా విచారణ జరిపింది. జంటకు మద్దతుగా తీర్పును వెలువరించింది. నైతికత వేరు చట్టం వేరని కోర్టు పేర్కొంది. జంటను అరెస్ట్ చేయవద్దని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. యువతి కుటుంబసభ్యుల నుంచి జంటకు ఎలాంటి హానీ కలుగకుండా చూసుకోవాలని కూడా ఆదేశించింది. ఇంటికి వెళ్ల వద్దని యువతి కుటుంబసభ్యులకు సూచించింది. నేరుగా లేదా ఫోన్ ద్వారా లేదా థర్డ్ పార్టీ ద్వారా జంటతో సంప్రదింపులు కూడా జరపవద్దని అంది. జంట భద్రతను స్థానిక పోలీస్ చీఫ్‌కు అప్పగించింది. తదుపరి విచారణను ఏప్రిల్ 8వ తేదీకి వాయిదా వేసింది.

# ఘనంగా రామ్ చరణ్ పుట్టినరోజు వేడుకలు





**విజయనగరం : జయ జయహే**

రామ్ చరణ్ యువశక్తి మరియు జనసేన పార్టీ సంయుక్త ఆధ్వర్యంలో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు బాలాజీ జంక్షన్ వద్ద సుఖీభవ హాస్పటల్ ఆవరణలో రాంచరణ్ యువశక్తి టీం ప్రతినిధులు మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్పర్సన్ పాలవలస యశస్వి , జనసేన నేత గురాన అయ్యలు-రాధిక దంపతులు మెగా అభిమానులు, జనసేన నాయకుల సమక్షము లో కేక్ కట్ చేసి, స్వీట్స్ పంపిణీ చేశారు. అనంతరం రక్తదాతలకు మెమొంటోలు అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పాలవలస యశస్వి , గురాన అయ్యలు మీడియాతో మాట్లాడుతూ మన దేశంలోనే కాదు ఇతర దేశాల్లోనూ రామ్ చరణ్ కు విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందన్నారు. మెగాస్టార్ తనయుడిగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టినప్పటికీ.. తనకంటూ ప్రత్యేకమైన ఫ్యాన్ ఫాలోయింగ్ సొంతం చేసుకున్నారన్నారు. సినిమా సినిమాకు వేరియేషన్స్ చూపిస్తూ నటుడిగా దూసుకుపోతున్నారన్నారు. గ్లోబల్ స్టార్ గా ఎదిగినా తన అంకితభావం, వినయం మారలేదన్నారు... సేవ రంగంలో కూడా తండ్రి ని ఆదర్శంగా తీసుకుని సేవా కార్యక్రమాలు అధికంగా నిర్వహిస్తున్నారన్నారు. రామ్‌చరణ్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలు అధిరోహించాలని ప్రార్థించారు. మెగా ఫ్యామిలీ ఆశయ సాధన లో భాగంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న జిల్లా రామ్ చరణ్ యువశక్తి టీం సభ్యుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమానికి విశేష సంఖ్యలో మెగా ఫ్యామిలీ అభిమానులు, జనసేన నాయకులు, జనసైనికులు,వీరమహిళలు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.




# ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

**మాడుగుల (జయ జయహో)**

మాడుగుల సెయింట్ అన్స్ నవజీవన్ స్రవంతి మహిళా సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మార్చి 26న ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సంఘం మేనేజింగ్ డైరెక్టర్ సిస్టర్ సజిత సమర్థవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాడుగుల న్యాయమూర్తి ఎన్. లావణ్య మాట్లాడుతూ మహిళలకు ధైర్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. అవసరమైన సందర్భాల్లో “లేదు” అని చెప్పడం నేర్చుకోవాలని, అలాగే తమ పిల్లల విద్యపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆమె సూచించారు. సెయింట్ అన్స్ సొసైటీ ప్రావిన్షియల్ మహిళల కృషిని ప్రశంసిస్తూ, వారు ధైర్యంగా, సాహసంగా ముందుకు సాగాలని ప్రోత్సహించారు. సీనియర్ అడ్వకేట్ ఐ. ఎం. అహ్మద్ సమాజంలో వచ్చే సమస్యలను వెంటనే కోర్టుకు తీసుకెళ్లకుండా, పరస్పర చర్చల ద్వారా సంఘ స్థాయిలోనే పరిష్కరించుకోవాలని సూచించారు. ఇలా చేయడం వల్ల సమాజంలో ఐక్యత మరియు శాంతి పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ వేడుకలో సిస్టర్ ఏంజెల్, సిస్టర్ నిర్మల, సిస్టర్ సలీనా మరియు ఇతర సిస్టర్స్ పాల్గొన్నారు. అలాగే సిబ్బంది మరియు బోర్డు సభ్యులు కలిసి ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. సుమారు 500 మంది గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని, తమ హక్కులు, శక్తి మరియు సమాజంలో తమ పాత్రపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మహిళలు అర్థవంతమైన సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. .



# డిజిటల్ యుగంలో పెరుగుతున్న పెట్టుబడి మోసాలు

**(సి.హెచ్.ప్రతాప్)**

**విదేశాల్లో స్థిరపడిన భారతీయులు ఆర్థికంగా పటిష్టమైన వర్గంగా గుర్తింపు పొందినప్పటికీ మోసగాళ్ల పాలిట వారు సులభమైన లక్ష్యాలుగా మారుతుండటం ఆందోళన కలిగిస్తోంది. తాజాగా అమెరికాలో నివసిస్తున్న హైదరాబాద్‌కు చెందిన ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సుమారు రూ. 10.3 కోట్ల మేర భారీ మోసానికి గురైన ఘటన ఈ ప్రమాదాన్ని కళ్లకు కడుతోంది. అధిక లాభాల ఆశ చూపి నకిలీ కాసినో పెట్టుబడి పేరుతో జరిగిన ఈ వంచన పెట్టుబడి నిర్ణయాల్లో వహించాల్సిన అప్రమత్తతను మరోసారి గుర్తు చేస్తోంది. ఈ మోసం వెనుక ఉన్న వ్యూహాన్ని గమనిస్తే నిందితులైన ఒక దంపతులు అత్యంత ఆకర్షణీయమైన ఆఫర్లతో బాధితుడిని సంప్రదించారు. కాసినో వ్యాపారంలో పెట్టుబడి పెడితే అతి తక్కువ కాలంలోనే ఊహించని లాభాలు గడించవచ్చని నమ్మబలికారు. తొలుత చిన్న మొత్తాలను పెట్టుబడిగా పెట్టించి వాటిపై కొంత లాభాన్ని తిరిగి చెల్లించడం ద్వారా బాధితుడిలో పూర్తి విశ్వాసాన్ని కలిగించారు. ఆ నమ్మకంతోనే బాధితుడు దశలవారీగా భారీ మొత్తాలను వారి ఖాతాల్లో జమ చేశాడు. చివరకు సుమారు రూ. 10 కోట్లు వసూలు చేసిన ఆ దంపతులు అదృశ్యమవడంతో బాధితుడు మోసపోయానని గ్రహించాడు.**

ప్రస్తుతం ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు. ఇందులో ప్రధాన నిందితులతో పాటు మరికొందరి ప్రమేయం ఉండవచ్చని అనుమానిస్తున్నారు. అంతర్జాతీయ ఆర్థిక లావాదేవీలు, డిజిటల్ చెల్లింపు మార్గాలను మోసగాళ్లు వినియోగించుకోవడంతో ఈ కేసు దర్యాప్తు అధికారులకు సవాలుగా మారింది. సాంకేతికతను అడ్డు పెట్టుకుని విదేశీ గడ్డపై ఉన్న వారిని సైతం వంచించడం మోసగాళ్ల తెగింపునకు నిదర్శనం. ఇది కేవలం ఒక వ్యక్తికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు; ఇటీవల కాలంలో ఇటువంటి పెట్టుబడి మోసాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. అధిక లాభం -- అల్ప కాలం అనే మంత్రంతో మోసగాళ్లు అమాయకులను వలలో వేసుకుంటున్నారు. కృత్రిమ మేధస్సు, నకిలీ వెబ్‌సైట్లు, నమ్మశక్యం కాని డిజిటల్ ప్రచారాలతో ఈ మోసాలను అసలైన వ్యాపారాలుగా భ్రమింపజేస్తున్నారు. విదేశాల్లో ఉండేవారికి స్థానిక వ్యాపార నియమాలు వ్యక్తుల నేపథ్యంపై సరైన అవగాహన లేకపోవడాన్ని వీరు ఆసరాగా చేసుకుంటున్నారు.



పెట్టుబడి మోసాలలో సైకోలాజికల్ మానిప్యులేషన్ పాత్ర కీలకంగా ఉంటోంది. మోసగాళ్లు బాధితుల అవసరాలను, ఆశలను ఆసరాగా చేసుకుని వారిని మానసికంగా తమ నియంత్రణలోకి తెచ్చుకుంటారు. ఒకసారి డబ్బులు పెట్టిన తర్వాత బాధితుడు ఆ సొమ్మును తిరిగి పొందాలనే ఆరాటంలో మరిన్ని నిధులు జమ చేసేలా ఒత్తిడి చేస్తారు. టెలిగ్రామ్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా గ్రూపులను సృష్టించి అక్కడ నకిలీ లాభాల స్క్రీన్ షాట్లను చూపిస్తూ నమ్మకం కలిగిస్తారు. ఆర్థికంగా బాగా ఉన్నవారిని గుర్తించడానికి వీరు డేటా బ్రోకర్ల నుండి సమాచారాన్ని సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కోసారి డేటింగ్ యాప్స్ ద్వారా కూడా పరిచయమై పెట్టుబడి సలహాల పేరుతో భారీ దోపిడీకి పాల్పడుతున్నారు. దీనిని పిగ్ బుచరింగ్ స్కామ్ అని వ్యవహరిస్తారు. దీనివల్ల బాధితులు కేవలం ఆర్థికంగానే కాకుండా మానసికంగా కూడా కుంగిపోతున్నారు.



ఈ విపత్కర పరిస్థితుల్లో పెట్టుబడిదారులు అత్యంత విజ్ఞతతో వ్యవహరించాలి. ఏ పథకంలోనైనా ధనం పెట్టే ముందు ఆ సంస్థ యొక్క విశ్వసనీయతను, అధికారిక అనుమతులను క్షుణ్ణంగా పరిశీలించాలి. అపరిచిత వ్యక్తులు సోషల్ మీడియా ద్వారా ఇచ్చే ఆఫర్లను గుడ్డిగా నమ్మకూడదు. ముఖ్యంగా మార్కెట్ పరిమితులకు మించి అసధారణ లాభాలను వాగ్దానం చేసే పథకాల పట్ల ఎప్పుడూ అనుమానంతోనే ఉండాలి. కష్టపడి సంపాదించిన సొమ్మును వెచ్చించే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం శ్రేయస్కరం. ఏదైనా వ్యాపారం గురించి వింటున్నప్పుడు అది వాస్తవానికి దగ్గరగా ఉందో లేదో సరిచూసుకోవాలి. ప్రభుత్వ గుర్తింపు లేని యాప్స్ లేదా వెబ్ సైట్ల ద్వారా లావాదేవీలు చేయడం ప్రమాదకరం. మీ బ్యాంక్ వివరాలు, ఓటిపి వంటివి ఎవరికీ చెప్పకూడదు.

ప్రభుత్వాలు, పోలీసు యంత్రాంగం కూడా ఇటువంటి అంతర్జాతీయ సైబర్ మోసాలను అరికట్టేందుకు అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి. వివిధ దేశాల దర్యాప్తు సంస్థల మధ్య సమన్వయం పెంచి మోసగాళ్లను చట్టం ముందు నిలబెట్టాలి. ప్రజల్లో ఆర్థిక అవగాహన కల్పించే దిశగా విస్తృత ప్రచారం జరగాలి. డిజిటల్ యుగంలో అవకాశాలతో పాటు ప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయని గుర్తించి అప్రమత్తంగా ఉండటమే మన సంపదకు రక్షణ. విదేశీ భారతీయులు తమ సంపాదనను సురక్షితమైన మార్గాల్లోనే మదుపు చేయాలి. సైబర్ నేరాల పట్ల ఫిర్యాదు చేయడానికి ప్రభుత్వం కేటాయించిన హెల్ప్ లైన్ నంబర్లను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. అప్రమత్తతే అపార ధన నష్టాన్ని నివారిస్తుంది. సమాజంలో ప్రతి ఒక్కరు ఒకరికొకరు అవగాహన కల్పించుకోవడం ద్వారా ఈ నేరగాళ్ల నెట్‌వర్క్‌ను దెబ్బతీయవచ్చు.

# పెరుగుతున్న గ్లోబల్ వార్మింగ్ ముప్పు

**(సి.హెచ్.ప్రతాప్)**



భూమి శక్తి అసమతుల్యత మునుపెన్నడూ లేనంతగా తీవ్రరూపం దాల్చింది. సూర్యుడి నుండి గ్రహం గ్రహించే శక్తి, తిరిగి అంతరిక్షంలోకి విడుదల చేసే శక్తి మధ్య వ్యత్యాసం పెరగడమే ఈ అసమతుల్యతకు ప్రధాన కారణం. విచ్చలవిడి పారిశ్రామికీకరణ, విస్తరిస్తున్న పట్టణీకరణ, శిలాజ ఇంధనాల మితిమీరిన వినియోగం వల్ల హరితగృహ ప్రభావం పెరిగి వాతావరణం వేడెక్కుతోంది. ఈ ఉష్ణోగ్రతల పెరుగుదల, అస్తవ్యస్తమైన వాతావరణ మార్పులు ఇప్పటికే సామాన్య ప్రజల జీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. వ్యవసాయం కుంటుపడటం, కొత్త రకమైన ఆరోగ్య సమస్యలు తలెత్తడం, రోజువారీ జీవనశైలి దెబ్బతినడం వంటివి మన కళ్ళముందే జరుగుతున్నాయి. గడిచిన శతాబ్దంలో మానవ కార్యకలాపాల వల్ల వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ నిష్పత్తి విపరీతంగా పెరిగింది. ఇది భూమిపై ఉష్ణాన్ని బంధించి ఉంచడం వల్ల సముద్రాల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. అంతర్జాతీయ ఒప్పందాలు ఎన్ని ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో తక్షణ, ఆచరణాత్మక చర్యలు చేపడితేనే ఈ విపత్తు నుండి బయటపడగలం.

గ్లోబల్ వార్మింగ్ వల్ల మంచు పర్వతాలు కరగడం, సముద్ర మట్టాలు పెరగడం వంటి ముప్పులు పొంచి ఉన్నాయి. ఇది ప్రకృతి వైపరీత్యాలకు, తీవ్రమైన ఎండలకు, కరువు పరిస్థితులకు దారితీస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు రవాణా రంగాల్లో విద్యుత్ వాహనాల వాడకం పెరుగుతున్నప్పటికీ, అది ఆశించిన స్థాయిలో మార్పు తీసుకురాలేకపోతోంది. ఇక్కడ స్థానిక సంస్థల పాత్ర ఎంతో కీలకం. సౌర శక్తి, పవన శక్తి వంటి పునరుత్పాదక ఇంధన వనరులను గరిష్టంగా వినియోగించుకోవడమే దీనికి సరైన పరిష్కారం. భారతదేశంలో కాలుష్యాన్ని తగ్గించడానికి, శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని నియంత్రించడానికి సౌరశక్తికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. పారిశ్రామిక రంగంలో ఇంధన సామర్థ్య ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయడం ద్వారా ఉద్గారాలను గణనీయంగా తగ్గించవచ్చు. భారీ యంత్రాల వినియోగంలో మార్పులు తీసుకురావడం, తక్కువ విద్యుత్ ఖర్చయ్యే సాంకేతికతను ప్రోత్సహించడం అవసరం. గ్రామీణ ప్రాంతాల్లో కూడా సౌర విద్యుత్ దీపాలు, వంట పరికరాల వాడకం పెంచాలి.

కేవలం ప్రభుత్వాలు మాత్రమే కాకుండా పౌర సంఘాలు, పాఠశాలలు పర్యావరణ పరిరక్షణను ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించాలి. ప్రతి విద్యార్థికి మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం వంటి అలవాట్లు చిన్నప్పటి నుండే నేర్పించాలి. పునర్వినియోగం, నీటి సంరక్షణ వంటి అంశాలు కేవలం పాఠాలకే పరిమితం కాకుండా నిత్యకృత్యాలుగా మారాలి. చెత్తను వేరు చేయడం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం వంటి చిన్న మార్పులు సమాజంలో పెద్ద ప్రభావాన్ని చూపిస్తాయి. వర్షపు నీటిని నిల్వ చేయడం ద్వారా భూగర్భ జలాలను పెంచే ప్రయత్నాలు ప్రతి ఇంట్లోనూ జరగాలి. ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపరచడం ద్వారా వ్యక్తిగత వాహనాల వాడకాన్ని తగ్గించి వాయు కాలుష్యాన్ని అదుపులోకి తీసుకురావచ్చు. నగరాల్లో సైకిల్ ట్రాక్‌ల ఏర్పాటు, పాదచారులకు అనువైన రహదారులు నిర్మించడం ద్వారా పెట్రోల్ వినియోగాన్ని తగ్గించే వీలుంది. వాతావరణ సమతుల్యత దెబ్బతినడం వల్ల పక్షులు, జంతువుల మనుగడ కూడా ప్రశ్నార్థకమవుతోంది. అడవుల నరికివేతను అడ్డుకోవడంతో పాటు ఖాళీ ప్రదేశాల్లో అడవుల పెంపకాన్ని ఉద్యమంగా చేపట్టాలి.

భూమి శక్తి సమతుల్యతను కాపాడటం అనేది ఒకరిద్దరి పని కాదు, ఇది సమిష్టి బాధ్యత. వాతావరణ మార్పుల తీవ్రతను గమనిస్తూ మౌనంగా ఉండటం వల్ల భవిష్యత్తు తరాలకు నివాసయోగ్యం కాని గ్రహాన్ని మిగిల్చిన వారమవుతాము. తక్షణమే ఇంధన వినియోగ పద్ధతులను మార్చుకోకపోతే సంభవించే నష్టాలు ఊహాతీతం. పారిశ్రామిక వ్యర్థాల నిర్వహణలో కఠినమైన నిబంధనలు పాటించడం, అడవుల విస్తీర్ణం పెంచడం వంటి పనులు యుద్ధ ప్రాతిపదికన జరగాలి. పర్యావరణ హితమైన జీవనశైలిని అవలంబించడం ద్వారా మాత్రమే మనం ఈ సంక్షోభాన్ని ఎదుర్కోగలం. ప్రతి పౌరుడు తన వంతుగా ఇంధనాన్ని ఆదా చేస్తూ ప్రకృతి సంపదను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. సామాజిక స్పృహతో కూడిన సమిష్టి కృషి ద్వారానే భూమిని రక్షించుకోగలమని ఈ ప్రస్తుత పరిస్థితులు మనకు హెచ్చరిస్తున్నాయి.

వాతావరణ మార్పుల వల్ల వర్షపాతంలో అనిశ్చితి ఏర్పడి సాగురంగం తీవ్రంగా నష్టపోతోంది. రైతులు తమ పంట కాలాలను మార్చుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. జనాభా పెరుగుతున్న కొద్దీ ఆహార భద్రత కోసం ఎక్కువ భూమిని సాగులోకి తీసుకురావాల్సి వస్తోంది, కానీ భూసారం తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తోంది. వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రీయ పద్ధతులను ప్రోత్సహించాలి. వ్యర్థాల నుండి శక్తిని తయారు చేసే ప్రక్రియలను మున్సిపల్ కార్పొరేషన్లు చేపట్టాలి. పాఠశాలల్లో పర్యావరణ క్లబ్బుల ద్వారా చిన్నారులను భాగస్వాములను చేయాలి. విద్యుత్ ఆదా చేయడంపై అవగాహన సదస్సులు నిర్వహించాలి. ప్రతి పారిశ్రామిక యూనిట్ తన లాభాలలో కొంత భాగాన్ని పర్యావరణ పునరుద్ధరణ కోసం ఖర్చు చేయాలి. భూమి వేడెక్కడం వల్ల సముద్ర జీవరాశి కూడా ప్రమాదంలో పడుతోంది, ఇది ఆహార గొలుసును దెబ్బతీస్తుంది. నదులను కలుషితం చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. సౌర గ్రిడ్లను ఏర్పాటు చేసి ప్రతి గ్రామాన్ని విద్యుత్ స్వయం సమృద్ధి దిశగా నడిపించాలి. ఈ మార్పులు త్వరగా వస్తేనే మనం భూమిని ముప్పు నుండి రక్షించగలము.



# మళ్లీ రామరాజ్యం రావాలి!

## మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి

**విశాఖపట్నం (జయ జయహో)**

రాష్ట్రంలో దుష్ట పరిపాలనకు విముక్తి జరిగి ప్రజలు కోరుకునే విధంగా మళ్లీ రామరాజ్యం రావాలని వైయస్సార్సీపీ సమన్వయకర్త దక్షిణ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. 33వ వార్డు అల్లిపురం కుమ్మర వీధిలో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని స్వామివారి పల్లకి ఊరేగింపులో భక్తులతో పాటు పల్లకిని ఊరేగించారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ ఇచ్చిన మాట తప్పని శ్రీరామచంద్రస్వామి రాజ్యంలో ప్రజలను సుఖశాంతులతో జీవించే వారన్నారు. అలాగే వైసిపి ప్రభుత్వం లలో జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి మడమ తిప్పని ముఖ్యమంత్రిగా ప్రపంచ దేశాలకే ఆదర్శంగా నిలిచి ప్రజలకు సంక్షేమాన్ని అభివృద్ధిని సుపరిపాలనను అందించారని గుర్తు చేశారు. నేడు కూటమి ప్రభుత్వంలో దుష్టసంరక్షణ జరగాల్సిన అవసరం ఉందన్నారు. 33వ వార్డులో ఘనంగా జరిగిన శ్రీ సీతారాముల కళ్యాణం వేడుకల్లో తాను కూడా భాగస్వామి అవ్వడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. దేశవ్యాప్తంగానే కాకుండా ప్రపంచ దేశాలలో కూడా శ్రీరామ నామ సంకీర్తనతో మార్మోగుతున్నాయన్నారు. తమ అధినేత జగన్మోహన్ రెడ్డి కుటుంబానికి శ్రీరాముని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. అలాగే వైఎస్ఆర్సిపి కుటుంబ సభ్యులకు దక్షిణ నియోజకవర్గ ప్రజలకు వాసుపల్లి గణేష్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 33 వ వార్డు ప్రెసిడెంట్ ముత్తాబత్తుల రమేష్, మాజీ కార్పొరేటర్ పచ్చిరపల్లి రాము,జిల్లా జనరల్ సెక్రటరీ గణగాళ్ల రామరాజు, వార్డు నాయకులు మహిళ నేతలు స్థానిక మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# క్షత్రియ కళ్యాణ మండపంలో శ్రీరామనవమి వేడుకలు





**విశాఖపట్నం (జయ జయహే)**

శ్రీరామనవమి సందర్భంగా శుక్రవారం సీతమ్మధారలోని క్షత్రియ కళ్యాణ మండపంలో సిరి వెంకటేశ్వర డెవలోపర్స్ మేనేజింగ్ డైరెక్టర్ కె.కె రాజు దంపతులు, సుదర్శన రాజు దంపతులు, మరియు క్షత్రియ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా శ్రీ కె.కె రాజు గారు దంపతులు, సుదర్శన రాజు దంపతులు పాల్గొని శ్రీ సీతారాముల వారి కల్యాణమహోత్సవమును అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కె.కె రాజు మీడియాతో మాట్లాడుతూ.. మిత్రులకు, శ్రేయోభిలాషులకు,ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరామనవమి సందర్భంగా సీతారామచంద్ర మూర్తుల వారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించడం ఎంతో విశేషమని పేర్కొన్నారు. ఈ కల్యాణ మహోత్సవంలోక్షత్రియ సంక్షేమ సమితి ప్రెసిడెంట్ తిరుపతి రాజు,ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు,యన్.శ్రీనివాసరాజు,విసి జి.యస్.యన్ రాజు,యం.ఆర్.కె రాజు,సి.హెచ్ వెంకటపతిరాజు,క్షత్రియ సంక్షేమ సమితి పెద్దలు,యువకులు, మహిళలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.




## గ్లోబల్ స్టార్ రాంచరణ్
# పుట్టినరోజు వేడుకలు

### శ్రీరామాలయంలో ప్రత్యేక పూజలు
### మెగా వైద్య శిభిరం
### పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ

**విజయనగరం, మార్చ్ 27, జయ జయహే :**

ప్రముఖ యువ నటుడు, మెగా పవర్ స్టార్, గ్లోబల్ స్టార్ రాంచరణ్ పుట్టినరోజు వేడుకలను శుక్రవారం విజయనగరం జిల్లా చిరంజీవి యువత,అంజనీ పుత్ర చిరంజీవి ప్రజా సేవా సంఘం మరియు అంజనీ పుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా చిరంజీవి యువత అధ్యక్షులు త్యాడ రామకృష్ణారావు (బాలు) ఘనంగా నిర్వహించారు. రాంచరణ్ గోత్ర నామాలతో విజయనగరం కాలనీలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, 42వ డివిజన్ కామాక్షి నగర్ అయ్యన్నపేట జంక్షన్ వద్దనున్న మున్సిపల్ నడక మైదానంలో క్వీన్స్ ఎనఆరఐ హాస్పిటల్ వారి సౌజన్యంతో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి ముఖ్యఅతిథిగా హాజరైన డిస్ట్రిక్ట్ 102 గవర్నర్ ఎ. తిరుపతిరావు, సామాజిక కార్యకర్త త్యాడ రామకృష్ణారావు మాట్లాడుతూ... ప్రపంచంలోనే మెగాఫ్యామిలీ అభిమానులు సేవల్లో ముందుంటారని, దీనికి నిదర్శనం ప్రపంచ నలుమూలలా మెగాభిమానులు ఉన్నారన్నారు. 42వ డివిజన్లో ఉన్న సుమారు 20 మంది పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రములను ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో అంజనీపుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సిహెచ్ రమణ, కోశాధికారి కోట్ల ఈశ్వరరావు, డిప్యూటీ గవర్నర్ తాడ్డి ఆదినారాయణ, క్లబ్బు ఉపాధ్యక్షుడు పి అప్పలరాజు, క్లబ్బు ఉప కోశాధికారి ఐ అప్పలరాజు, జాలివాకర్ వై నలమహారాజు, క్లబ్బు పెద్దలు చిరంజీవి యువత ప్రతినిధులు కోట్ల సత్యనారాయణ, కె రమేష్, రాంబాబు, శ్రీను, జనార్ధన్ మాస్టారు, అప్పన్న, నరేష్ తదితరులు పాల్గొన్నారు





## భక్తి శ్రద్ధలతో
# సీతారామ కళ్యాణ మహోత్సవం


**గాజువాక జయ జయహే,**

నియోజకవర్గం 69 వార్డు లో శ్రీరామ నవమి సందర్భంగా తుంగలం రామాలయ ప్రాంగణములో మాజీ కార్పొరేటర్ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సీతారామ కళ్యాణ మహోత్సవం నిర్వహించారు 80 మంది దంపతులతో అంగరంగ వైభవంగా నిర్వహించారు, ఆలయ సాంప్రదాయ పూజలు నిర్వహించి ఈ వేడుకలో పాల్గొన్న ప్రతి భక్తునికి స్వామి వారికి అక్షింతలు వేసే అవకాశం ఇవ్వడంతో భక్తుల్లో మరింత విశ్వాసముతో మునిగితేలారు, ఈ వేడుకలకు గ్రామములోఉన్న ఆలయ కమిటీ సభ్యులు యూత్ సభ్యులు అంతా క్రమ శిక్షణతో ఎవరికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా గ్రామములో ఉన్న అంద రకూ అన్నసమారాధన ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమములో గ్రామ పెద్దలు కే జి ఆర్,యువసేన, మహిళా మణులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం శ్రీరామ నవమి వేడుకలు

**విశాఖపట్నం (జయ జయహే )**

శ్రీరామనవమి సందర్భంగా శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం లోధర్మకర్తల మండలి చైర్మన్ పొట్నూరు వెంకట కృష్ణారావు,కార్యనిర్వాహణ ధికారి పి. సత్యన్నారాయణ మూర్తి ఆధ్వర్యంలో శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సీతారాముల వారి కళ్యాణాన్ని వేద పండితులు ఆధ్వర్యంలో బాజా భజంత్రీల మధ్య అంగరంగ వైభవంగా జరిపారు. శ్రీ సీతారాముల కళ్యాణం కార్యక్రమాన్ని భక్తులు అధిక సంఖ్యలో హాజరై కనులార తిలకించారు•



# ఘనంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం




### వేలాదిగా తరలివచ్చిన భక్తులు

**నిడదవోలు, (జయజయహే)**

తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం ఉ నకరమిల్లి గ్రామం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఉనకరమిల్లి వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ సీతారామస్వామి కళ్యాణ మహోత్సవాలకు ముఖ్య అతిథిగారాష్ట్ర పర్యాటక, సంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ కందుల దుర్గేష్ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు హాజరై కల్యాణ మహోత్సవాన్ని తిలకించి, స్వామివారిని దర్శించుకున్నారు ఈ మహోత్సవాలను తిలకించేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించేందుకు పోలిరెడ్డి నారాయణస్వామి, రామకృష్ణవేణి దంపతులు పెళ్లిపెద్దలుగా వ్యవహరించి, శ్రీ సీతారాముల కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.కళ్యాణ కార్యక్రమం అనంతరం విచ్చేసిన భక్తులకు ఉచిత అన్నసమారాధన, తీర్థప్రసాదాలు, వడపప్పు, చలివిడి, పానకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడాయి.





# ప్రజల భద్రతే లక్ష్యం

### నిడదవోలు లింగంపల్లిలో పోలీసుల అవగాహన డ్రైవ్

**నిడదవోలు జయ జయహే**

నిడదవోలు పట్టణంలోని లింగంపల్లి 23వ వార్డులో గ్రామ సందర్శనలో భాగంగా పోలీసులు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు మరియు ఎల్ హెచ్ ఎం ఎస్ కెమెరాల ప్రాముఖ్యతపై ప్రజలకు విస్తృతంగా వివరించారు. సీఐ తిలక్, ఎస్ఐ జగన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో గ్రామ ప్రజలకు సైబర్ మోసాల నుంచి ఎలా జాగ్రత్తపడాలి, రోడ్డు భద్రతా నియమాలను ఎలా పాటించాలి, ప్రజల భద్రత కోసం ఏర్పాటు చేసిన కెమెరాల ఉపయోగం గురించి తెలియజేశారు. అదేవిధంగా, శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం అత్యంత ముఖ్యమని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ వార్డు ఇంచార్జి బండి వేణుగోపాలకృష్ణ సీఐ తిలక్, ఎస్ఐ జగన్‌లను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో లింగంపల్లి 23వ వార్డు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





## జీవం ఉన్న పంటలతో
# సబల భోజనాల పండుగ

### ప్రకృతి ఆధారంగా పంటలు పండించడం అవసరం
### ఆకుల చలపతి రావు

**సింహాచలం (జయ జయహే)**

జీవం ఉన్న పంటలతో సబల భోజనాల పండుగ నిర్వహిస్తున్నామని ఎపి నర్సరీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆకుల చలపతి రావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం సింహాచలం దేవస్థానానికి చెందిన గోశాల లో "సబల భోజనాల పండుగ" కోసం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సేవ్ సంస్థ వ్యవస్థాపకులు విజయరాం నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగుతోంది అన్నారు. ప్రకృతి ఆధారంగా పంటలు పండించడం అవసరం అన్నారు. ప్రధానంగా ప్రకృతి పంటలే ఆరోగ్యకరం, ఆనంద దాయకం అని వివరించారు. అలాంటి జీవం ఉన్న పంటలతో మన పూర్వీకులు వంటలు ఎలా చేసుకున్నారో అలాంటి రుచి కరమైన, సుచికరమైన, ఆరోగ్యకరమైన వంటలు వండటం, భుజించడం, అవగాహన కలిగించడం కోసం ఏప్రిల్ 1 నుంచి 5 వ తేదీ వరకూ సభలో భోజనాలు పండుగ నిర్వహించడం జరిగుతోంది అన్నారు. ఈ కార్యక్రమంలో తులసి నేచరల్స్ సత్యనారాయణ మాట్లాడుతూ సబల భోజనాలు పండుగలలో ఉత్తరాంధ్ర సాంస్కృతిక కళల ప్రదర్శన నిర్వహించడం జరిగుతోంది అన్నారు. అలాగే పాత ఇత్తడి, మట్టి పాత్రలలో వంటడం జరుగుతుంది అని వివరించారు. జన్యుమార్పిడి పంటలు వద్దే వద్దు అన్నారు. మనం మన సాంస్కృతిని, కళలను కాపాడుకోవాలి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జర్నలిస్ట్ ఫ్రంట్ అధ్యక్షులు ఎం ఆర్ ఎన్ వర్మ మాట్లాడుతూ ప్రతి జర్నలిస్టు ఈ సబల భోజనాలు పండుగలలో పాల్గొనాలని, జయప్రదం చేయాలని, విస్తారంగా ప్రచారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం, ప్రకృతి రైతు గుంటూరు జగన్నాద రాజు, మేంగో మేన్ అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.



## జాంపేట పోలీస్ లైన్స్‌లో వైభవంగా
# శ్రీ కోదండ సీతారాముల కల్యాణం

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

స్థానిక జాంపేట రిజర్వ్ పోలీస్ లైన్స్‌లో శుక్రవారం శ్రీ కోదండ సీతారాముల వారి దివ్య కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఐపీఎస్., తన సతీమణి లావణ్యతో కలిసి వధూవరులుగా పీటలపై కూర్చుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా పోలీస్ యంత్రాంగం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు భక్తులను ఆకట్టుకున్నాయి. కళ్యాణ ఘట్టాలను వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు, రామాలయ కమిటీ సభ్యులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ డి. నరసింహ కిషోర్ మాట్లాడుతూ, శ్రీరామ నవమి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీరాముని ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. శ్రీరాముడు సత్యం, ధర్మం, నీతికి ప్రతీకగా నిలిచాడని, ఆయన చూపిన మార్గంలో నడిస్తే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (ఏఆర్) ఎల్. చెంచి రెడ్డి, డీఎస్పీ (ఎస్‌బీ) బి. రామకృష్ణ, జోనల్ డీఎస్పీలు, ఇన్స్పెక్టర్లు, ఆర్ఐలు, సబ్ ఇన్స్పెక్టర్లు, ఆర్ఎస్ఐలు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కార్మికులు, కర్షకులను నమ్మించి నట్టేట ముంచారు

## చెల్లింపులకు ఎమ ఇచ్చిన హామీలు ఏమయ్యాయి ???

**చోడవరం : మార్చి 27,జయ జయ హే**

గోవాడ సుగ ర్స్ రైతులు కార్మికులకు బకాయిలు చెల్లిస్తామంటూ నమ్మబలికిన నిలువునా మోసం చేశారని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలపై మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం మీడియాతో సమావేశమైన రెడ్డిపల్లి మాట్లాడుతూ బకాయిలు చెల్లించాలని, గోవాడ సుగర్స్ లో క్రషింగ్ జరపాలని అఖిలపక్షాలు, రైతు, కార్మిక సంఘాలు తలపెట్టిన నిరసన దీక్షలకు మేమున్నామంటూ ... బకాయిలు చెల్లిస్తామని, ఫ్యాక్టరీ కు పూర్వవైభవం తీసుకువస్తామని ఎమ్మెల్యేలు ఇచ్చిన హామీలు నెలలు దాటుతున్నను,.... బకాయిలు చెల్లించకుండా కార్మికులు, కర్షకులను మోసం చేశారని విమర్శించారు. చెరకు రైతులు, కార్మికుల సహకారంతో ప్రతిష్టాత్మక స్థానం సాధించిన గోవాడ సుగర్స్ లో పాత బకాయిలు చెల్లించాలంటూ రైతు సంఘాలు, అఖిలపక్షాల ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సైతం కార్మిక కర్షక కుటుంబాలు పస్తులతో తలపెట్టిన 23 రోజుల నిరసన దీక్షలకు ప్రజా ప్రతినిధులు నీళ్లు వదిలారని తెలిపారు. సుమారు 23 రోజులకు కదలి వచ్చిన చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఫ్యాక్టరీ వద్ద కార్మికులు, కర్షకులు చేస్తున్న నిరసన దీక్ష శిబిరానికి వచ్చిన ఎమ్మెల్యేలు సమస్యలు తెలుసుకుని ... కార్మికులు కర్షకుల పాత బకాయిలు చెల్లింపులకు హామీలు ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్. రాజు మాట్లాడుతూ గోవాడ ఫ్యాక్టరీ ఆధునీకరణకు కృషి చేస్తామని,



జనరల్ బాడీ నిర్వహించి అందరి అభిప్రాయాలతోనే నిర్ణయం తీసుకుంటామని తెలిపారన్నారు. కార్మిక, రైతు సంఘాలు, అఖిలపక్ష పార్టీల ప్రతినిధులు శిబిరం తరపున ఇచ్చిన వినతి పత్రాన్ని స్వీకరించి, కార్మికులు, చెరకు రైతుల బకాయిలను ముఖ్యమంత్రి చంద్రబాబుతోను, ఆర్థిక శాఖ మంత్రులతో చర్చించి నెల రోజుల్లోగా చెల్లించేందుకు, ఫ్యాక్టరీ ఆధునికీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి నిధులు తీసుకొస్తామని బహిరంగంగా హామీలు ఇచ్చి, నెలలు దాటుతున్నను, ఎమ్మెల్యేల వ్యవహారం నిమ్మకునీరెత్తనట్లు ఉండడంతో హామీలు గాలికి కలిసిపోయాయని, దీనిపై మరో పోరాటం చేయాలన్నారు.

రైతులకు, కార్మికులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకపోతే ...కొద్ది రోజుల్లోనే రైతులు, కార్మికులను ఐక్యంగా కూడగట్టి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అఖిలపక్షాల తో చర్చించి మరో పోరాటానికి నాంది పలుకుతామని తెలియజేశారు.



## వాడవాడలా ప్రారంభమైన శ్రీరామనవమి వేడుకలు

**చోడవరం,మార్చి 27 జయ జయ,హే**

శ్రీరామనవమి సందర్భంగా చోడవరం మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రామాలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచే ఆయా ఆలయాల వద్ద సీతా,లక్ష్మణ ,హనుమాన్ సమేత శ్రీరామచంద్రమూర్తికి భక్తులు అభిషేక పూజలను నిర్వహించారు. ఈ నేపథ్యంలోనే స్థానిక వ్యాపార వీది అభయాంజనేయ స్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శ్రీరామచంద్రుని వరుడు గాను సీతామహాలక్ష్మి దేవిని వధువు గాను అలంకరించి వేదమంత్రోచ్ఛారణల నడుమ సీతారాముల కళ్యాణం కన్నుల పండువుగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ రాజు దంపతులు ఈ కళ్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామివారికి ,సీతమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. వేద పండితులు ఆచార సాంప్రదాయాల అనుసరించి వివాహ మహోత్సవాన్ని జరిపారు. ఈ పూజల్లో హనుమత్ మాలాదారులు భక్తులు పాల్గొని నైవేద్యాల సమర్పించి పూజలు జరిపారు అలాగే ఎడ్ల వీధి, వెలమవీధి, బాలాజీ నగర్, కోపరేటివ్ కాలనీ తదితర వార్డుల్లో రామాలయాలు వద్ద శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. అలాగే మండలంలోని గోవాడ, వెంకన్నపాలెం గవరవరం, అంబేరుపురం ,లక్కవరం ,మైచర్లపాలెం, దామనాపల్లి ,శ్రీరామపట్నం ,గౌరీ పట్నం తదితర గ్రామాల్లోని శ్రీరామనవమి మహోత్సవాలు అత్యంత వేడుకగా సాంప్రదాయబద్ధంగా నిర్వహించడంతో పాటు అన్న సమారాధనలు కూడా జరిపారు. దీంతో వాడవాడలా ఆధ్యాత్మిక కార్యక్రమాలు తో సందడిగా మారాయి. రాత్రి స్వామి వారి తిరువీధి ఉత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



## మంత్రి విజ్ఞప్తితో కేంద్రానికి సీఎం లేఖ

### మొక్కజొన్న రైతులకు భారీ ఊరట దిశగా కీలక ప్రయత్నం

**అమరావతి, మార్చి 27: (జయ జయహే)**

రాష్ట్రంలో మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితులను గమనించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, రైతుల అభ్యున్నతే లక్ష్యంగా వెంటనే చర్యలు చేపట్టారు. 2025-26 రబీ సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 4.83 లక్షల హెక్టార్లలో సాగు జరిగి 37 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న ఉత్పత్తి నమోదైనప్పటికీ, మార్కెట్ ధరలు కనీస మద్దతు ధర కంటే తక్కువగా ఉండటంతో రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని మంత్రి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. అత్యవసర అవసరాల నిమిత్తం రైతులు తక్కువ ధరలకు పంటను అమ్ముకోవాల్సి వస్తోందని వివరించిన మంత్రి, ఈ పరిస్థితుల్లో తక్షణమే కేంద్రం జోక్యం అవసరమని ముఖ్యమంత్రి కి స్పష్టం చేశారు. రైతులకు న్యాయమైన ధర కల్పించాలనే లక్ష్యంతో ధర లోపం చెల్లింపు (పిడీపీఎస్ స్కీం) ను మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ (ఎమ్ ఐ ఎస్) ద్వారా అమలు చేయాలని, ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్‌కు 100% నష్టాన్ని కేంద్ర ప్రభుత్వం భరించేలా చేయాలని, అలాగే ప్రస్తుత 25% పరిమితిని 100% ఉత్పత్తికి విస్తరించి, జూన్ 2026 వరకు పథకాన్ని కొనసాగించాలని మంత్రి అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే స్పందించి, కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కి లేఖ రాసి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.



## పిఠాపురం కాలనీలో శ్రీరామ నవమి బ్రహ్మోత్సవం

### హాజరైన బీజేపీ అధ్యక్షులు మాధవ్ తదితరులు

**విశాఖపట్నం, మార్చి 27, జయ జయహే :**

మద్దిలపాలెం పిఠాపురం కాలనీలో శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో జరిగే వార్షిక శ్రీ రామ నవమి బ్రహ్మోత్సవం , కళ్యాణోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. కళ్యాణోత్సవం ఈ నెల 25 నుండి 30 వరకు భక్తిశ్రద్ధలతో, భక్తుల భాగస్వామ్యంతో నిర్వహించారు. ఈ ఉత్సవాలకే ప్రధాన ఆకర్షణ అయిన శ్రీ సీతారామ కళ్యాణం, శుక్రవారం వేద సంప్రదాయాల ప్రకారం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆశీస్సులు పొందారు. భక్తులందరికీ నిర్వాహకులు అన్నప్రసాదం అందించారు. ఏపీ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్, మాధురితో కలిసి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమాలను వ్యవస్థాపక ట్రస్టీ వి. సీతారామయ్య, ట్రస్టీ వేణు గోపాల్, ఆలయ కమిటీ సభ్యులు రామచంద్ర నాయక్ పర్యవేక్షించారు. ఈ ఉత్సవంలో విశ్వక్సేన ఆరాధన, ధ్వజారోహణం, తిరువీధి ఉత్సవం, సుదర్శన నరసింహ యాగం, శ్రీ లక్ష్మీ హోమం, కుంకుమార్చన, మహా పూర్ణాహుతి, మరియు చక్ర స్నానం వంటి ముఖ్యమైన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ కాలమంతటా ప్రతిరోజూ రామాయణ, సుందరకాండ పారాయణాలు నిర్వహించనున్నారు. భక్తులకు ఆధ్యాత్మికంగా పరిపూర్ణమైన అనుభూతిని అందించేలా పిఠాపురం కాలనీ అంతటా ఉత్సాహభరితమైన, భక్తిపూర్వక వాతావరణం నెలకొల్పారు.



## గ్యాస్ రేట్లు తగ్గించాలి

### గిరిజన గ్రామాలకు గ్యాస్ సరఫరా చేయాలి

**చోడవరం మార్చి 27 జయ జయహే**

గ్యాస్ రేటు తగ్గించి గ్యాస్ ఆఫ్ చేయాలని కోరుతూ శుక్రవారం రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ కళ్యాణ్ లోవ గిరిజనులు కోరుతున్నారు. ఈ మేరకు ఖాళీ గ్యాస్ బండలు వద్ద కంచాలు కొట్టి గిరిజన గ్రామాలకు గ్యాస్ సరఫరా చేయాలనీ వినూత్నంగా కార్యక్రమం నిర్వహించారు. యుద్ధం కారణంగా వివిధ నిత్యవసర వస్తువులు గ్యాస్ కోసం రావికమతం వెళ్లి అనేకసార్ తిరిగి వస్తున్నాం. ఫోన్ ద్వారా గ్యాస్ బుక్ చేస్తే బుక్ అవడం లేదన్నారు. తక్షణమే తమ గ్రామాలకు గ్యాస్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## కింతలి గ్రామంలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

**మాడుగుల మార్చి 27 జయ జయ హే**

మాడుగుల మండలం కింతలి గ్రామంలో శుక్రవారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు సాయంత్రం పెద్ద ఎత్తున గ్రామంలో సీతారాములకి సారే సమర్పించారు. భక్తులు వివిధ రకాల పిండి వంటలను ఇంటిలో తయారుచేసి గ్రామంలో ఊరేగించి స్వామివారికి సమర్పించారు. ఈ సందర్భంగా పల్లకి ఊరేగింపు స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. మండలంలో గల గాదిరాయి సత్యవరం జంపిన ఒమ్మలి తదితరు గ్రామాల్లో కూడా శ్రీరామ నవమీ వేడుకలు ఘనంగా నిర్వహించారు లక్ష్మీనారాయణ స్వామివారి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మాడుగుల మండలం ఎం రామచంద్రపురం గిరిజన గ్రామాల్లో కూడా శ్రీరామనవమి వేడుకలు గిరిజనులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. అలాగే కేజీపురం రామాలయం లోనూ వీరవిల్లి రామాలయంలోనూ ఏం కోటపాడు రామాలయంలోనూ ముకుందపురం, వందర్లపాలెం రామాలయంలో కూడా శ్రీరామనవమి వేడుకలు ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు.

# ఘనంగా కొత్తూరు రచయితల వేదిక కవి సమ్మేళనం

**శ్రీకాకుళం జిల్లా, కొత్తూరు (జయ జయహే )**

కొత్తూరు రచయితల వేదిక ఆధ్వర్యంలో స్థానిక విజ్ఞాన భారతి ఉన్నత పాఠశాల ఆవరణలో 12 నెల సమావేశం నిర్వహించినట్లు వేదిక అధ్యక్షులు కలమట శ్రీరాములు తెలిపారు. శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సభ్యులంతా తమ కవితలను వినిపించారు. అధ్యక్షులు కలమట శ్రీరాములు జైశ్రీరామ్, ప్రధాన కార్యదర్శి అమ్మల కామేశ్వరి ఉగాది ఉత్సవం, సహ కార్యదర్శి గడసాపు ఉషారాణి కష్టజీవి కవి, గౌరవాధ్యక్షులు పెద్దిన కులశేఖర ఆల్వార్ నైతిక విలువలు, కార్యవర్గ సభ్యులు అల్లిన వెంకట రమణ మూర్తి దిలీప్ రాజా పట్నాయక్ మధురం మనదేశం, బాణాల రమణమూర్తి దేశాల మధ్య యుద్ధాలా? అను కవితలను వినిపించి కవి సమ్మేళనాన్ని రంజింపజేసారు. అనంతరం కవులందరికీ గౌరవ సత్కారాలు జరిగాయి. గతేడాది ఏప్రిల్ ఇరువది నాలుగున స్థాపించి, తొలి కవి సమ్మేళనంతో ప్రారంభమైన ఈ కొత్తూరు రచయితల వేదిక, నేడు దిగ్విజయంగా 12 వ నెలవారీ సమావేశం నిర్వహించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని అధ్యక్షులు కలమట శ్రీరాములు అన్నారు. 12 వ కవి సమ్మేళనం జరుపుకుని నేడు ఒక సంవత్సరం పూర్తి చేసుకోవడం పట్ల తమకెంతో గర్వకారణంగా ఉందని



ప్రధాన కార్యదర్శి అమ్మల కామేశ్వరి అన్నారు. కొరవే పురస్కారాలంటూ ఇటీవల ఎనిమిది మందికి ప్రదానం గావించిన చరిత్ర కొత్తూరు రచయితల వేదిక సొంతమని గౌరవాధ్యక్షులు పెద్దిన కులశేఖర ఆల్వార్ అన్నారు. కొత్తూరు కవనం అనే ముప్పది కవితల పుస్తకాలను సాహిత్య లోకానికి అందించిన వైనం కొరవే మరో ఘనత అని కార్యవర్గ సభ్యులు అల్లిన వెంకట రమణ మూర్తి దిలీప్ రాజా పట్నాయక్ అన్నారు. కొరవే సభ్యులం అయ్యాక వివిధ పత్రికల్లో తమ తమ రచనలు ప్రచురణ ఎంపికై, సామాజిక బాధ్యతను నిర్దేశించడం జరుగుతుందని ఇది గొప్ప శుభ పరిణామమని సహ కార్యదర్శి గడసాపు ఉషారాణి అన్నారు. అనంతరం శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలుపుకుంటూ మిఠాయిలను పంచుకున్నారు.

# ఎందాకా... విశాఖ మెట్రో!

## ఏప్రిల్ నుంచీ భూ సేకరణ

## కేంద్ర సూచనలతో మళ్లీ డీపీఆర్

## కూటమి సర్కార్ మార్పులతో ఆగిన టెండర్లు



(జయ జయహే బ్యూరో చీఫ్ - విశాఖపట్నం )

దశాబ్ద కాలంగా ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న విశాఖ మెట్రో ఇంకా పట్టాలెక్కలేదు. కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ జోక్యంతో మళ్లీ డీపీఆర్ సిద్ధం చేయనుంది. అందుకు రైట్స్ సంస్థ ద్వారా రెండు మాసాల్లో డీపీఆర్ సిద్ధం చేయించి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని నిర్ణయించింది. కేంద్ర సూచనలతో రాష్ట్ర ప్రభుత్వ కొత్తగా సర్వే చేపట్టింది. విశాఖ స్టీల్‌ప్లాంట్ నుంచి కొమ్మాది మధ్య డబుల్ డెక్కర్ పై ఓవర్ మెట్రో నిర్మాణం చేపట్టాలని రాష్ట్రం ప్రతిపాదించింది. దీనికి భిన్నంగా డబుల్ డెక్కర్ అక్కర్లేదని నేషనల్ హైవే మధ్యలో కారిడార్ నిర్మించి మెట్రో నడపడం ఉత్తమమని కేంద్రం అభిప్రాయపడింది. డబుల్ డెక్కర్ వల్ల అంచనా వ్యయం భారీగా పెరగడంతో పాటు ప్రయాణీకుల నుంచి ఆదరణ అంతంత మాత్రమే ఉంటే భారీగా నష్టపోతామని గ్రహించిన కేంద్రం ఈ కొత్త ప్రతిపాదన తీసుకొచ్చింది. దీంతో రాష్ట్రం మళ్లీ డీపీఆర్ మార్చే పనిలో పడింది. మెట్రో తొలిదశలో 46.22 కిలోమీటర్ల మేర మూడు కారిడార్లతో 43 స్టేషన్‌లతో నిర్మించనున్నారు. ఎనఏడీ కొత్తరోడ్, తాటిచెట్లపాలెం, గురుద్వారా , మద్దిలపాలెం హనుమంతవాక వంటి ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ స్టేషన్లు రానున్నాయి. వీటి నిర్మాణానికి దాదాపు రూ. 11498 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. ఏప్రిల్ నుంచీ భూ సేకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. రైట్స్ సంస్థ చేపట్టే సర్వేలు ఆధారంగా ఈ ప్రాజెక్టును మూడేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ప్రభుత్వం చెబుతోంది. అంటే వచ్చే ఎన్నికల నాటికి ఈ ప్రాజెక్టును పట్టాలపైకి ఎక్కించాలని ఉవ్విళ్లూరుతోంది. విశాఖలో సెమీ రింగ్ రోడ్డుతో పాటు మెట్రో నిర్మాణాన్ని వేగవంతం చేసి ఎన్నికలకు వెళ్లాలని కూటమి సర్కార్ భావిస్తోంది.



## ఘనంగా శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవాలు

అగనంపూడి (జయ జయహే)

జీవీఎంసీ 79 85 వార్డుల అనుసంధానంగా ఉన్న అగనంపూడి ఏరియాలో పాత అగనంపూడి మామిడి తోటలో కొండయ్యవలస, పెదమడక, దానబోయినపాలెం దెబ్బపాలెం పీనమడక లో సీతారామ కళ్యాణం భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించడం జరిగినది. అన్న సమారాధన భారీ ఎత్తున జరిగినది భక్తులతో రామాలయాలు అన్ని కిటకిట లాడినవి మాజీ కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్, రౌతు శ్రీనివాసరావు ఎడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ కల్పన బి రామారావు బలిరెడ్డి శ్రీను బండారు చందు రమేష్ శీరంశెట్టి బాబ్జి ఎల్వి రమణ అర్జున్ పలక అచ్యుత్ అండబోయిన మంగరాజు కడవలి రమణ గంతకోరు అప్పారావు విందుల నారాయణరావు ధర్మాల వ్యాస శర్మ మరియు రామాలయాల కమిటీలు పాల్గొన్నారు.





## ప్రశాంతి నిలయంలో వైభవంగా శ్రీ సీతారామ కల్యాణం

పుట్టపర్తి, మార్చి 27, జయ జయహే :

పవిత్రమైన శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా ప్రశాంతి నిలయంలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్య సన్నిధిలో శుక్రవారం శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో జరిగింది. సాయి కుల్వంత్ హాల్లో నిర్వహించిన ఈ దివ్య కార్యక్రమం వేద మంత్రోచ్చారణలు, భక్తి గీతాల మధ్య, దేశ విదేశాల నుంచి విచ్చేసిన వేలాది భక్తుల సమక్షంలో ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగింది. భగవాన్ వారి భౌతిక సాన్నిధ్యంలో ప్రారంభమైన ఈ సంప్రదాయం నేటికీ అదే పవిత్రతతో కొనసాగుతూ, ధర్మం మరియు పవిత్రత యొక్క దివ్య కలయికను సూచిస్తుంది. కార్యక్రమంలో గణపతి పూజ, నవగ్రహ పూజ, మంగళ్యధారణ వంటి శాస్త్రోక్త విధానాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సంవత్సర వేడుకల ప్రత్యేక ఆకర్షణగా భక్షణ సమర్పణం నిలిచింది. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన భక్తులు కలిసి 300కు పైగా రకరకాల నైవేద్యాలను భక్తి భావంతో సమర్పించారు. అలాగే తలంబ్రాలు తయారీ కూడా ఎంతో విశేషంగా జరిగింది. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని 31 జిల్లాల భక్తులు ఈ సేవలో పాల్గొని, స్వయంగా తొక్క తొలగించి, పవిత్రతతో బియ్యాన్ని సిద్ధం చేసి సమర్పించారు. పట్టు వస్త్రాలు, ఆభరణాలతో అలంకరించిన శ్రీరామచంద్ర స్వామి, సీతాదేవి విగ్రహాలు దివ్య కాంతిని వెదజల్లుతూ, ఆధ్యాత్మిక ఆనందాన్ని ప్రసరింపజేశారు. శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్ జె రత్నాకర్ , హిమవాహ్ని రత్నాకర్, ఇతర ట్రస్టీలు వందలాది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## దొమ్మేటి వెంకట్ రెడ్డికి నివాళులు

జంగారెడ్డిగూడెం -జయ జయహే

దివంగత దొమ్మేటి వెంకట్ రెడ్డి జయంతి వేడుకలు సోమవారం స్థానిక శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో సోమవారం జరిగాయి. వెంకట్ రెడ్డి శెట్టి బలిజ కుల సంక్షేమం కోసం నిరంతరం పాటు బడ్డారని నాయకులుపేర్కొన్నారు. ఆయన సేవలు మర్చి పోరాదని ప్రతివారు స్మరించు కోవాలని.. కోరారు . బర్మా వెళ్లి వ్యాపారం చేసిన వెంకట్ రెడ్డి అక్కడ మేయర్ గా పోటీ చేసి గెలిచారని గుర్తు జేసుకుంటున్నారు. అయిదేళ్లు పదవీ కాలం పూర్తి చేశారని తెలిపారు. శెట్టి బలిజ వారినిబర్మా తీసుకొని వెళ్లి అక్కడ ఆర్థికంగా వారిని బలోపేతం ఘనంత అలాగే ఉభయగోదావరి జిల్లా ల్లో శెట్టి బలిజీయులకు ప్రతిష్టా త్మకమైన రాజ్యసభ సీటు కేటాయింపు వెనుక ఆయన కృషి వుందన్నారు..వైసీపీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు కుక్కల ధర్మరాజు, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకుడు బత్తిని చిన్న, గుబ్బల వెంకటేశ్వర్లు, లింగస్వామి, మురళీకృష్ణ సోమేశ్వరరావు పాల్గొన్నారు.

## జనసేనలో భారీగా ఉద్యమి సభ్యత్వ నమోదు

### జనసేన సాధక్, ఐటీ టీం కో-ఆర్డినేటర్ అనిల్ కుమార్

పాడేరు, మార్చి 27, జయ జయహే :



పాడేరు నియోజకవర్గంలో జనసేన ఉద్యమి సభ్యత్వాలు భారీగా నమోదు చేసినట్టు జనసేన సాధక్, ఐటీ టీం కో-ఆర్డినేటర్ సీ.హెచ్ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీలో తనకు అవకాశం కల్పించిన జనసేన పార్టీ అధ్యక్షులు, ఉ ప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జానపద కళలు,సృజనాత్మకత అకాడమీ చైర్మన్,జనసేన పార్టీ పాడేరు అసెంబ్లీ మరియు అరకు పార్లమెంట్ ఇంచార్జ్ డాక్టర్ వంపూరు గంగులయ్యలకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. జనసేన పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ప్రతి ఒక్కరూ అడుగులు వెయ్యాలని,పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, సభ్యత్వ విధానాన్ని పవన్ కళ్యాణ్ భావజాలాన్ని వివరించాలని పిలుపునిచ్చారు. జనసేన ఉద్యమి సభ్యత్వం తీసుకోవడం అంటే కేవలం ఒక రాజకీయ పార్టీకి మద్దతు ఇవ్వడం మాత్రమే కాదని, సమాజంలో గౌరవం, జనసేన కార్యకర్తలు ప్రజలకు సేవ చేయాలనే తపనతో ముందుకు వస్తారని ఒక నమ్మకం ఉందని, సమస్యల పై స్పందించి అవసరమైనప్పుడు సహాయం చేయడం వల్ల ఉద్యమి సభ్యులకు ప్రత్యేక గౌరవం లభిస్తుందని తెలిపారు..



## ప్రేమసదన్ మందిరంలో వైభవంగా శ్రీ సీతారాముల కల్యాణం

విశాఖపట్నం, మార్చి 27, జయ జయహే :

శ్రీరామనవమి సందర్భంగా విశాఖ ఎంవీపీలోని శ్రీ సత్యసాయి ప్రేమసదన్ మందిరంలో శ్రీ సీతారాముల కల్యాణం వైభవంగా, భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమం శ్రీ సత్యసాయీ సేవా సంస్థల సిటీ సేవా సమితి ఆధ్వర్యంలో జరిగింది. ఈ పవిత్ర కల్యాణోత్సవంలో పలువురు మంది భక్తులు పాల్గొని శ్రీ సీతారాముల దివ్య కల్యాణాన్ని దర్శించుకొని ఆధ్యాత్మిక ఆనందాన్ని అనుభవించారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా శ్రీ సత్యసాయీ సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు పి.ఆర్.ఎస్.ఎన్. నాయుడు, శ్రీ సత్య సాయి సేవా సంస్థల రాష్ట్ర సాంస్కృతిక కార్యక్రమాల కోఆర్డినేటర్ ఎం ఎస్ ప్రకాశరావు, సిటీ సేవా సమితి కన్వీనర్ బి. సాయి కుమార్ దంపతులు పాల్గొన్నారు. సాయంత్రం నిర్వహించిన భజన కార్యక్రమంలో సిటీ సమితి గాయని గాయకులు తమ భక్తి గీతాలతో భక్తులను ఆధ్యాత్మిక మాధుర్యంలో ముంచెత్తారు. ఈ కార్యక్రమం భక్తి, శాంతి, సౌహార్దతను ప్రతిబింబిస్తూ విజయవంతంగా ముగిసింది.



## ఘనంగా సీతారామ కళ్యాణ మహోత్సవం

మాడుగుల,మార్చి 27 జయ జయ హే

శ్రీరామ నవమి సందర్భంగా మాడుగుల గవరవీధిలో వేంచేసి యున్న శ్రీ వైబోగ సీతా రామాలయంలో శుక్రవారం రాత్రి శ్రీ సీతారాములు వారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అనేక మంది దంపతులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కల్యాణాన్ని నిర్వహించుకున్నారు. ఉదయం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు.ఆలయ అర్చకులు ప్రమోద్ ఆధ్వర్యంలో అర్చక బృందం కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ దాతలు జల్లు సారధి ఈ కార్యక్రమానికి తాళిబొట్టు అందజేయగా, మరో భక్తుడు పెంటకోట రామకృష్ణ స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.ఏప్రిల్ 3 వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది.అలాగే స్థానిక పార్థసారధి ఆలయంలో కూడా శ్రీరామ నవమి వాడుకలు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది దుక్కా దుర్గారెడ్డి దంపతులు ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.



## అంగరంగ వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

### ఊరంతా భక్తి పరవశం

గార్లదిన్నె (జయ జయహే )

శ్రీరామనవమి సందర్భంగా లోలూరు గ్రామంలో భక్తిశ్రద్ధలతో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సీతారాముల వారి కళ్యాణాన్ని వేద పండితులు హరినాథ్, మోహన్ స్వామి ఆధ్వర్యంలో బాజా భజంత్రీల మధ్య అంగరంగ వైభవంగా జరిపారు. ముందుగా ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ సీతారాముల కళ్యాణం కార్యక్రమాన్ని భక్తులు అధిక సంఖ్యలో హాజరై కనులార తిలకించారు. సాయంత్రం ఆంజనేయ స్వామివారిని ఎడ్ల బండిపై ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బండి కొండయ్య, అనంత చౌదరి, కరణం ఓబులేష్,విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు



## కాకరపాడులో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు..

కొయ్యురు :(జయ జయహే )న్యూస్ మార్చ్ 28

కొయ్యూరు మండలంలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు జరిగాయి. కాకరపాడులో జరిగిన ఈ వేడుకల్లో జలమూరి కుటుంబం గత వంద ఏళ్లుగా మూడు తరాల నుండి సీతారామ కళ్యాణాన్ని నిర్వహిస్తోంది. ఈ ఏడాది వేడుకను పండితుడు రామచంద్రమూర్తి శర్మ మంత్రోచ్చారణల మధ్య చిటికెల కిషోర్ దంపతులు పవిత్ర క్రతువులో పాల్గొన్నారు. వేడుకను వీక్షించేందుకు భక్తులు తరలిరాగా, అనంతరం అందరికీ భారీ అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంప్రదాయం గ్రామ ప్రజల్లో ప్రత్యేక భక్తి భావాన్ని నింపింది. ఈ కార్యక్రమానికి వేద సంకల్ప సేవ ట్రస్టు వారు పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమానికి వేలాదిగా భక్తులు పాల్గొని దేవుని ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమాన్ని జలుమూరి నాగేశ్వరావు, చంద్రశేఖర్,గణబాబు, వెంకట గిరిబాబు, గోవిందరావు,ఆనంద్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ధన్యంరాజు పద్మరాజు, డి.వి.డి ప్రసాద్, నౌండ్రు శ్రీను,పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

For a pure tomorrow.. జయహో



### గుండె ఆరోగ్యానికి
# ఈ ఆహారం కచ్చితం

**దేశంలో గుండె సమస్యలతో ఎంతో మంది బాధపడుతున్నారు. గుండె సంబంధిత వ్యాధుల కారణంగా ఎంతో మంది మరణిస్తున్నారు. వేళకు ఆహారం తీసుకోకపోవడం, వ్యక్తిగత, వృత్తిపరమైన ఒత్తిళ్లు, తగినంత వ్యాయమం లేకపోవడం వంటివి గుండె పనితీరును మందగింప జేస్తున్నాయి. రక్తనాళాల్లో కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగిపోవడం కూడా గుండె పనితీరును ప్రభావితం చేస్తోందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.**

చేపలు తింటే ఉపయోగాలెన్నో: సాధారణంగా చేపలు ఎక్కువగా తినేవారిలో హృదయ సంబంధిత వ్యాధులు తక్కువేనంటున్నారు వైద్య నిపుణులు. చేపల్లో ఉండే ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు గుండె పనితీరును మెరుగు పరుస్తాయి.
ఆకు కూరలు: ఆకు కూరలు గుండెకు ఎంతో మంచిది. క్యాన్సర్ వంటి రోగాలను సైతం దరిచేరనివ్వవు. పాలకూర, కొత్తమీద, ర్యాడిష్ మొదలైన వాటిలో కొవ్వు శాతం తక్కువ ఉండటంతో పాటు ఫోలిక్ యాసిడ్, మెగ్నీషియం, కాల్షియం, పోటాషియం ఎక్కువగా లభిస్తాయి. ఇవి గుండె పనితీరును మెరుగు పర్చడంలో ఎంతో సహాయపడతాయి. రోజూ ఆహారంలో భాగంగా ఇవి తీసుకునేవారికి మిగిలిన వారితో పోలిస్తే హార్ట్ ఎటాక్ వచ్చే అవకాశాలు 11 శాతం తక్కువగా ఉంటాయి.
ఓట్స్: ప్రతిరోజు ఉదయం బ్రేక్‌ఫాస్టులో ఓట్స్ తినడం గుండెకు ఎంతో మేలు చేస్తాయి. వీటిలో లభించే బీటా గ్లూకాన్ శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తుంది. అందుకే ప్రతిరోజు ఓట్స్ తీసుకోవాలి. గోధుమలు, బార్లీ, పప్పు ధాన్యాలు, బీన్స్ మొదలైనవి ఆహారంలో తీసుకోవడం మంచిది. వీటిలో ఉండే విటమిన్స్, ఐరన్, ఫైబర్ యాంటీ ఆక్సిడెంట్లు రక్తపోటును అదుపులో ఉంచుతాయి. దీని ద్వారా గుండె పనితీరు మెరుగుపడుతుంది. ఇవే కాకుండా టోమాటోలు, యాపిల్స్, సోయా వంటివి రోజువారీగా తీసుకున్నట్లయితే గుండెను పూర్తిగా ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

# ప్రెగ్నెన్సీ ప్లాన్ చేస్తున్నారా?
## అయితే ఈ టిప్స్ ఫాలో అవ్వండి...



**కొంతమంది ఆడవారు త్వరగా పిల్లల్ని కనాలనుకుంటారు. అలాంటివారు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అవేంటో తెలుసుకోండి. పిల్లలను ప్లాన్ చేసుకునే దంపతులు.. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి..?**

పెళ్ళైన జంటలు.. త్వరగా పిల్లల్ని కనాలనుకుంటారు. అలాంటి వారు వారి లైఫ్‌స్టైల్‌లో కొన్ని హెల్దీ హ్యాబిట్స్‌ని ఫాలో అవ్వాలి. దీని వల్ల వారు త్వరగా పిల్లల్ని కంటారు. మరి ఆ హెల్దీ హ్యాబిట్స్ ఏంటి? ఏయే టిప్స్ ఫాలో అయితే త్వరగా సంతానం కలుగుతుందో పూర్తి వివరాలు తెలుసుకోండి.



**డాక్టర్‌ని కన్సల్ట్ అవ్వడం..**
గర్భం దాల్చడానికి ముందు దంపతులిద్దరూ ముందుగా హెల్త్ చెకప్ చేయించుకోవాలి. దీంతో మిమ్మల్ని పరీక్షించిన డాక్టర్స్ ఏమైనా సమస్యలుంటే వాటికి తగిన ట్రీట్‌మెంట్‌ని సజెస్ట్ చేస్తారు. లేదంటే.. పిల్లలు కనడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచిస్తారు. అవేంటో తెలుసుకోండి.

**వర్కౌట్..**
రెగ్యులర్ వర్కౌట్ అనేది గుండె, ఊపిరితిత్తులు, ఇమ్యూనిటీని బలంగా చేస్తుంది. అధిక బరువు, ఊబకాయం ఉన్నవారు రెగ్యులర్‌గా వర్కౌట్ చేయాలి. అధిక బరువు ఉన్నవారికి గర్భధారణ ఆలస్యమవుతుంది. కొన్ని సమస్యలు ఎదురవుతాయి. కాబట్టి, హెల్దీ వెయిట్ మెంటెయిన్ చేయాలి. రోజుకి 30 నిమిషాల నుండి 60 నిమిషాల వర్కౌట్ చేయాలి. వారానికి 150 నుండి 300 నిమిషాల వర్కౌట్ చేయడం వల్ల కండరాలు బలంగా మారతాయి. ఏరోబిక్స్, వాకింగ్, రన్నింగ్ వంటివి చేయొచ్చు. ఒత్తిడిని దూరం చేసే డీప్ బ్రీథ్, మెడిటేషన్, యోగా కూడా చేయొచ్చు.

**మంచి ఆహారం..**
అదే విధంగా.. సరైన పోషకాలతో నిండిన ఆహారాన్ని తీసుకోవాలి. కూరగాయలు, పండ్లు, ధాన్యాలు, ప్రోటీన్స్ ఉన్న పాల, ఇతర ఫుడ్స్ తీసుకోవాలి. హెల్దీ లిక్విడ్స్ తీసుకోవాలి. దీని వల్ల బరువు మెంటెయిన్ చేయొచ్చు. సంతానోత్పత్తి పెరుగుతుంది.

**వీటికి దూరంగా..**
హెల్దీ ఫుడ్స్ తీసుకోవడమే కాదు.. కొన్నింటి తినడాన్ని తగ్గించాలి. స్వీట్స్, జంక్, ప్రాసెస్డ్ ఫుడ్స్‌కి దూరంగా ఉండాలి. కెఫిన్ డ్రింక్స్ సంతానోత్పత్తిని ఎఫెక్ట్ చేస్తాయి. కాబట్టి, రోజుకి తక్కువ పరిమాణంలోనే కాఫీ తాగాలి.

**మద్యపానం, ధూమపానం..**
అదే విధంగా, మద్యపానం, ధూమపానం కూడా ఆడవారిలో అండాశయ నిల్వల్ని తగ్గిస్తాయి. మగవారిలో స్పెర్మ్ కౌంట్‌ని తగ్గిస్తుంది. కాబట్టి. ఈ రెండింటిని దూరం పెట్టాలి. దీని వల్ల మీ హెల్త్‌తో, సంతానోత్పత్తి సమస్యలు దూరమవుతాయి.

**నిద్రలేమి..**
నిద్రలేమి కారణంగా చాలా ఆరోగ్య సమస్యలు వస్తాయి. దీని వల్ల బరువు పెరుగుతారు. ఇది అండోత్సర్గం సమస్యలకి కారణమవుతుంది. దీంతో పాటు మగవారిలో స్పెర్మ్ ఆరోగ్యాన్ని ఎఫెక్ట్ చేస్తుంది. కాబట్టి, ప్రెగ్నెంట్ అవ్వాలంటే తగినంతగా నిద్రపోవాలి. మంచి నిద్ర ఒత్తిడిని కూడా దూరం చేస్తుంది.

# క్షణాల్లో తలనొప్పి తగ్గాలంటే..

**తలనొప్పిగా ఉంది అనే మాట మనం చాలా కామన్‌గా వింటాం. ఈ సమస్య రాగానే కొంతమంది తగ్గాలని ట్యాబ్లెట్స్ వేసుకుంటారు. అయితే, అలా కాకుండా తలనొప్పిని సహజంగానే తగ్గించేందుకు కొన్ని టిప్స్ ఉన్నాయి. అవేంటో తెలుసుకుని తలనొప్పిని దూరం చేసుకోండి.**

**కారణాలు..**
నిజానికీ తలనొప్పి రావడానికి చాలా కారణాలు ఉంటాయి. ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి, సరిలేని ఆహారం, ఎక్కువగా ఆల్కహాల్ తీసుకోవడం, కళ్ళు అదే పనిగా చూడడం, హైబీపీ, మైగ్రేన్స్, సైనస్, జలుబు, ధూమపానం, కాలుష్యం.. ఇవన్నీ కూడా తలనొప్పికి కారణాలే. అయితే, ఈ తలనొప్పిని తగ్గించేందుకు కొన్ని సహజ మార్గాలున్నాయి. అవేంటో తెలుసుకోండి.

**తలనొప్పిని తగ్గించే టిప్స్..**


**నీరు తాగడం..**
డీహైడ్రేషన్ వల్ల కూడా తలనొప్పిగా ఉంటుంది. కాబట్టి, ఆ సమస్యని తగ్గించేందుకు నీటిని తాగండి. వీటితతో పాటు హెర్బల్ డ్రింక్స్ తాగొచ్చు. అల్లం టీ, లెమన్ టీల వంటివి రక్తనాళాల వాపుని తగ్గించడంలో హెల్ప్ చేస్తాయి. వికారాన్ని తగ్గిస్తాయి.

**నమలొద్దు..**
కొంతమంది చూయింగ్ గమ్‌ని అదేపనిగా నములుతుంటారు. దీని వల్ల దవడ ప్రాంతం, బుగ్గల లోపలం భాగంలో నొప్పి ఉంటుంది. దీంతో తలనొప్పి తగ్గుతుంది. మెత్తని ఆహారాలు తినడం వల్ల తలనొప్పి తగ్గుతుంది.

**మసాజ్..**
మనం జుట్టుని టైట్‌గా జడవేసిన తలనొప్పి వస్తుంది. కాబట్టి, జడని లూజ్‌గా వేసుకుని తలపై మెల్లిగా మసాజ్ చేయండి. దీని వల్ల చాలా వరకూ రిలాక్స్ అవుతారు. తలనొప్పి తగ్గుతుంది. నుదురు, మెడపై మెల్లిగా మసాజ్ చేస్తే ఒత్తిడితో వచ్చే టెన్షన్ తలనొప్పి తగ్గుతుంది. ఎసెన్షియల్ ఆయిల్‌తో కనుబొమ్మలు, నుదుటిపై మసాజ్ చేస్తే రక్త ప్రసరణ పెరుగుతుంది. పుదీనా, తులసి, లావెండర్ నూనెలు కూడా వీటికి హెల్ప్ చేస్తాయి.

**రెస్ట్ తీసుకోవడం..**
తలనొప్పిగా ఉన్నప్పుడు కాసేపు ఈ పని చేయకుండా రెస్ట్ తీసుకోండి. వీలైతే ఓ చీకటి గదిలో 1, 2 గంటలు పడుకోవడం, మొబైల్స్, గ్యాడ్జెట్స్ వాడకాన్ని తగ్గించడం, రెస్ట్ తీసుకోవడం వల్ల తలనొప్పి తగ్గుతుంది.

**కోల్డ్ ప్యాక్..**
కొన్ని సార్లు అధిక వేడి కారణంగా కూడా తలనొప్పి పెరుగుతుంది. కాబట్టి, నుదుటిపై కోల్డ్ ప్యాక్‌ని అప్లై చేయండి. ఐస్ ప్యాక్స్‌ని మెత్తని గుడ్డలో పెట్టి నుదుటిపై అప్లై చేయండి. 15 నిమిషాల వరకూ ఇలానే చేస్తే తలనొప్పి తగ్గుతుంది. దీని వల్ల తలతిరగడం, మాట్లాడడంలో ఇబ్బంది, వంటి లక్షణాలు కూడా తగ్గుతాయి.



Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com